


Truth of News
RNI NO : APTEL/25/A0239
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్




సంపుటి: 01 | అనంతపురం | సంచిక : 267 | గురువారం 19 మార్చి 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## ప్రజా ప్రాముఖ్య సమస్యలపై
# చర్చ అవసరం

**- అందుకనుగుణంగా సమావేశాల రోజుల సంఖ్యను పెంచాలి**
**- రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే**

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం



ప్రజా ప్రాముఖ్యత ఉన్న సమస్యలపై లోతుగా చర్చించేందుకు చర్చలు అవసరమనీ, అందుకు వీలుగా సభా సమావేశాల సంఖ్యను పెంచాలని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే అన్నారు. బుధవారం రాజ్యసభలో పదవీ విరమణ చేస్తున్న 59 మంది ఎంపీలకు వీడ్కోలు పలికే ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. "పేదలు, సమాజంలోని అణగారిన వర్గాలు, రైతులు, కార్మికుల ప్రయోజనాలకు సంబంధించిన సమస్యలపై చర్చించడానికి మరింత అవకాశం ఉండాలి. తరచుగా ఈ సమస్యలను లేవనెత్తినప్పుడు అధికార పార్టీ దానిని విమర్శగా భావించి, కనీసం వినకుండానే ఖండించడం ప్రారంభిస్తుంది. అయితే ప్రభుత్వం ప్రజల ఆందోళనలను తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాలి" అని అన్నారు.

చట్టాల రూపకల్పనలో ప్రతిపక్ష సభ్యులు పాల్గొనేందుకు ఏ ఆటంకం కలిగినా అది పార్లమెంట్ వ్యవస్థను బలహీనపరుస్తుందని అన్నారు. "పార్లమెంట్ సభ్యులకు అందుబాటులో ఉన్న పరిమిత

- మిగతా 2లో..

# యుద్ధ బీభత్సం

**- అమెరికా, ఇజ్రాయిల్ దాడుల్లో ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి మృతి**
**- ఇరాన్ క్షిపణి స్థావరాలపై అమెరికా బంకర్ విధ్వంసక బాంబులు**
**- బుషెర్ అణు విద్యుత్ కేంద్రం సమీపంలో వైమానిక దాడి**
**- లారిజానీ హత్యకు ప్రతీకారంగా క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడిన టెహ్రాన్**
**- ఇరాన్ ప్రభుత్వం బలహీనపడలేదు : అమెరికాకు ఇజ్రాయిల్ రహస్య నివేదిక**



టెహరాన్– సూర్య వాస్తవం

మధ్యప్రాచ్యంలో యుద్ధ బీభత్సం కొనసాగుతోంది. ఇరాన్ భద్రతా దళాల అధినేత అలీ లారిజానీ, బసిజ్ వాలంటరీ మిలిషియా ఫోర్స్ కమాండర్ జనరల్ సొలైమనీలను హతమార్చిన ఇజ్రాయిల్, అమెరికా సేనలు బుధవారం జరిపిన తాజా దాడులలో ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మాయిల్ ఖతీబ్‌ను చంపాయి. త్వరలోనే మరిన్ని 'అనూహ్య పరిణామాలు' చోటుచేసుకుంటాయని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి కట్జ్ హెచ్చరించారు. ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా ఇరాన్ నేతలను, సైనికాధికారులను మట్టుపెట్టే అధికారాన్ని రక్షణ దళాలకు కట్టబెట్టామని ఆయన తెలిపారు. గుడారంలో దాక్కున్న సొలైమనీని వైమానిక దాడిలో హతమార్చామని ఇజ్రాయిల్ సైనిక ఇంటెలిజెన్స్ అధికారి ఒకరు చెప్పారు. మరోవైపు హోర్ముజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ క్షిపణి స్థావరాలపై అమెరికా 2,200 కిలోల బంకర్ విధ్వంసక బాంబులను ప్రయోగించింది. జలసంధిలో ఉన్న నౌకలను ధ్వంసం చేసేందుకు ఇరాన్ క్రూయిజ్ క్షిపణులను మోహరించిందని, వాటిని లక్ష్యంగా చేసుకొని ఈ దాడులు జరిపామని అమెరికా సైన్యం తెలిపింది. హోర్ముజ్ జలసంధిలో ప్రయాణించే చమురు ట్యాంకర్లకు రక్షణగా నౌకలను పంపాల్సిందిగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన అభ్యర్థనను అనేక మిత్ర దేశాలు

- మిగతా 2లో..



## రాహుల్, ప్రియాంక గాంధీతో
# సీఎం రేవంత్ రెడ్డి భేటీ

**- పాల్గొన్న పీసీసీ చీఫ్, ఎంపీలు**

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

ఢిల్లీ పర్యటనలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను సీఎం రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తో కలిసి సీఎం రేవంత్ రెడ్డి బుధవారం పార్లమెంట్‌కు చేరుకున్నారు. ఆయనకు ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, అనిల్ కుమార్ యాదవ్, నూతనంగా రాజ్యసభకు ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి, ఇతర ఎంపీలు పార్లమెంట్‌లో స్వాగతం పలికారు. అనంతరం పార్లమెంట్‌లోని ఎంపీల క్యాంటీన్‌లో పాత మిత్రులైన పలు రాష్ట్రాలకు చెందిన ఎంపీలను సీఎం పలకరించారు. అనంతరం రాహుల్ గాంధీని ఆయన ఛాంబర్‌లో కలిశారు.

2లో

# సంక్షేమం కోసమే అప్పులు!

**- వికలాంగులకు అండగా ఉంటాం : సీఎం చంద్రబాబు**
**- మంగళగిరిలో 'దివ్యాంగుల శక్తి' ప్రారంభం**

గుంటూరు – సూర్య వాస్తవం



వికలాంగులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రభుత్వం అప్పులు చేసినా, కేంద్రం నుంచి నిధులు తెచ్చినా పేదల సంక్షేమం కోసమేనని తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో బుధవారం ఆర్‌టిసి బస్సుల్లో విక లాంగులకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించే 'దివ్యాంగ శక్తి' పథకాన్ని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌తో కలిసి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. అనంతరం మంగళగిరి బస్ స్టేషన్ నుంచి పెనుమాక వరకు వికలాంగులతో కలిసి వారు ముగ్గురూ పయనించారు. ఆ తర్వాత క్యాంపు కార్యాలయానికి

- మిగతా 2లో..



## రాష్ట్రాలపై 'ఉపాధి' నిధుల భారం దారుణం

**- పీసీసీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల**

విశాఖపట్నం– సూర్య వాస్తవం

ఉపాధి హామీ నిధుల భారాన్ని కేంద్రం రాష్ట్రాలపై మోపడం దారుణమని పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల అన్నారు. ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో భాగంగా విశాఖలో పర్యటించిన ఆమె బుధవారం ఎయిర్‌పోర్టులో మీడియాతో మాట్లాడారు. యుపిఎ

- మిగతా 2లో..

# విజన్‌తో ముందుకెళ్తాం

**- ప్రతిపక్ష నేతగా సభకు రండి కేసీఆర్**
**- ఒక్కోమెట్టు ఎక్కుతూ సీఎం అయ్యా... 2029లోనూ మాదే అధికారం**
**- నాలుగు కోట్ల ప్రజల ప్రయోజనమే మా ధ్యేయం**
**- గవర్నర్ ప్రసంగంపై ప్రతిపక్షం ధన్యవాదాలు తెలపకపోవడం బాధాకరం**
**- పంటమార్పిడిపై అన్నదాతలను చైతన్యపరుస్తాం**
**- ఆర్గానిక్ ఫుడ్, వాణిజ్య పంటల సాగును ప్రోత్సహిస్తాం :**
**- శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి**
**- రేపటికి శాసనసభ వాయిదా**

హైదరాబాద్ – సూర్య వాస్తవం

ఎవరు కలిసొచ్చినా.. కలిసిరాకపోయినా 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నొక్కి చెప్పారు. ప్రతి రంగానికి ప్రత్యేక పాలసీలు రూపొందించి దానికనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ సభకు వచ్చి ప్రభుత్వానికి విలువైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. విజన్‌తో కూడిన గవర్నర్ ప్రసంగానికి ప్రతిపక్షం ధన్యవాదాలు తెలపకపోవడం బాధాకరమన్నారు. పెద్దాయన పార్టీ బాధ్యతలు అప్పగించిపోతే వాళ్లిద్దరూ(కేటీఆర్, హరీశ్‌రావు) చింపిన ఇస్తరాకు మాదిరిగా మారుస్తున్నారని విమర్శించారు. తాను క్షేత్రస్థాయి నుంచి ఒక్కో మెట్టు ఎక్కుకుంటూ రాజకీయనేతగా ఎదిగి సీఎం అయ్యాననీ, 2029లోనూ తమదే అధికారమని స్పష్టం చేశారు. బుధవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సీఎం మాట్లాడారు.



ఈ సందర్భంగా తమ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు. బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు అనుసరిస్తున్న తీరుపై తీవ్ర అసహనం, ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ రెండు పార్టీల వైఖరులను తప్పుబడుతూ సుదీర్ఘంగా ప్రసంగించారు. అనంతరం స్పీకర్ సభను శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తెలంగాణ ప్రజల,

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## ప్రజా ప్రాముఖ్య సమస్యలపై
# చర్చ అవసరం

(మొదటిపేజీ తరువాయి)

అవకాశాలలో కూడా ముఖ్యమైన అంశాలు ప్రస్తావించినప్పుడు, ఆ వ్యాఖ్యలు పార్లమెంటరీ నియమాలకు విరుద్ధమైనవి కానప్పటికీ, వాటిని తరచుగా సభా కార్యకలాపాల నుంచి తొలగిస్తున్నారు. అని అన్నారు. "రాజ్యసభ కార్య విధాన నియమావళి, సభా కార్యకలాపాల నిర్వహణపై కాలానుగుణ సమీక్ష అత్యవసరం. ఈ అంశం ప్రస్తుతం సాధారణ ప్రయోజనాల కమిటీ (జీపీసీ) పరిశీలనలో ఉంది. దీనిపై తీవ్రంగా చర్చించాల్సిన అవసరం ఉంది. రాజకీయాల్లో పాల్గొనే వారు ప్రజా జీవితం నుంచి ఎన్నడూ విరమించుకోరు. దేశ సేవ చేయాలనే వారి తపనలో వారు ఎన్నడూ అలసిపోరు" అని పేర్కొన్నారు.

**రాజకీయాల్లో ఫుల్‌స్టాప్‌లు ఉండవు: ప్రధాని మోడీ**

రాజ్యసభలో పదవీ విరమణ చేస్తున్న సభ్యులనుద్దేశించి ప్రధాని మోడీ మాట్లాడుతూ, పదవీకాలం ముగిసినంత మాత్రాన ప్రజాసేవ ముగిసినట్టు కాదన్నారు. రాజ్యసభ మేధావుల వేదిక అని, ఇక్కడ లభించే జ్ఞానానికి విలువ కట్టలేమని తెలిపారు. పార్లమెంట్‌ను ఒక బహిరంగ విశ్వవిద్యాలయంగా పేర్కొంటూ పదవీ విరమణ చేసిన ఎంపీలు తమ జీవితాల్లో చురుకుగా ఉండాలని కోరారు. హెచ్‌డీ దేవెగౌడ, మల్లికార్జున ఖర్గే, శరద్ పవార్ వంటి దిగ్గజ నేతల సహకారాన్ని మరువలేమని, సగానికి పైగా తమ జీవితాన్ని పార్లమెంటుకే అంకితం చేశారని ప్రశంసించారు. కొత్తగా ఎన్నికైన ఎంపీలు వారి నుంచి నేర్చుకోవాల్సినది ఎంతైనా ఉంటుందని సూచించారు.

**మాతో ప్రేమ...మోడీతో పెండ్లి**

మాజీ ప్రధాని దేవెగౌడను ఉద్దేశించి ఖర్గే వ్యాఖ్యలు

రాజ్యసభలో పదవీకాలం ముగిసిన సభ్యుల వీడ్కోలు సభలో కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే కాసేపు నవ్వులు పూయించారు. మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడను ఉద్దేశించి మాట్లాడుతూ, గత 54 ఏండ్లుగా ఆయన తనకు తెలుసని, ఆయనతో కలిసి పనిచేశానని చెప్పారు. 'అయితే ఏమి జరిగిందో తెలియదు కానీ, ఆయన మాతో ప్రేమ సాగించి మోడీని పెండ్లి చేసుకున్నారు' అంటూ చమత్కరించారు. దీంతో సభలో ఉన్న ప్రధాని మోడీతో సహా సభ్యులంతా నవ్వులు చిందించారు.

దేశానికి సేవ చేయాలనే తపన కలిగిన వారు రాజకీయాల్లో, ప్రజా జీవితంలో ఎన్నడూ అలసిపోరని ఖర్గే అన్నారు. కాగా, రాజ్యసభ సభ్యుల వీడ్కోలు సెషన్‌లో శరద్ పవార్, డీఎంకే నేత తిరుచ్చి శివతో తన అనుబంధాన్ని కూడా ఖర్గే గుర్తుచేసుకున్నారు. అయితే పవార్, తిరుచ్చి శివ తిరిగి రాజ్యసభకు రాబోతున్నారు. ఖర్గే తన ప్రసంగంలో కేంద్ర మంత్రి, ఆర్‌పీఐ(ఏ) చీఫ్ రామ్‌దాస్ అథవాలేపై కూడా చలోక్తులు విసిరారు. 'ఆయన ఎప్పుడూ తన కవితల్లో మోడీని పొగుడుతుంటారు. ఆయనకు మరే ఇతర కవితలు తెలియవేమో' అని చెప్పారు.

# సంక్షేమం కోసమే అప్పులు!

(మొదటిపేజీ తరువాయి)

చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ వారితో కొద్దిసేపు సమావేశమై యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అందరినీ ఆప్యాయంగా పలకరించిన ముఖ్యమంత్రి వారితో కలిసి భోజనం చేశారు. ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంపై ముఖ్యమంత్రికి వికలాంగులు ధన్యవాదాలు తెలిపారు. వికలాంగులతో ముఖ్యమంత్రి మాట్లాడుతూ వికలాంగుల శక్తిని ప్రపంచానికి చాటేలా, ఆత్మస్థైర్యంతో పని చేసేలా తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా వికలాంగులకు ఆత్మగౌరవం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. సాధికారత సాధించడానికి, గౌరవాన్ని మరింత పెంచడానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, భవిష్యత్తులోనూ వారిని ఆదుకునేలా మరిన్ని ఆలోచనలు చేస్తామన్నారు. రాష్ట్రంలో ఆసక్తి ఉన్న వికలాంగులకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు వెళ్లేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. వికలాంగులు అంటే విభిన్న ప్రతిభావంతులని, సమస్యను అధిగమించి విజయాలు సాధించే శక్తి ఉన్న వాళ్లని పేర్కొన్నారు.

గతంలో చేయూత కార్యక్రమం ద్వారా వికలాంగులకు సహాయం చేశామని, ట్రైసైకిళ్లతోపాటు టూ వీలర్లు అందించామని గుర్తు చేశారు. పింఛను కింద రూ.6 వేలు ఇస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని తెలిపారు. తీవ్ర ఆరోగ్య ఇబ్బందుల్లో ఉండే వారికి రూ.10 వేలు, మంచానికి పరిమితమైన వారికి రూ.15 వేలు ఇస్తున్నామని వివరించారు. ప్రస్తుతం ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని, ఐదు రకాల బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చని తెలిపారు. 'దివ్యాంగ శక్తి' పథకం ద్వారా 12.75 లక్షల మందికి ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తున్నామన్నారు. మహిళల కోసం తెచ్చిన స్త్రీ శక్తి పథకం ద్వారా ఇప్పటి వరకూ 52 కోట్ల ప్రయాణాలు జరిగాయని తెలిపారు. వికలాంగుల సమస్యలపై పోరాడుతున్నారంటూ మంద కృష్ణమాదిగ, గోనుగుంట్ల కోటేశ్వరరావులను అభినందించారు.

# రాష్ట్రాలపై 'ఉపాధి' నిధుల భారం దారుణం

(మొదటిపేజీ తరువాయి)

హయాంలో తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ విబి-గ్రామ్‌జిగా పేరు మార్పు చేసిందన్నారు. ఉపాధి హామీ పని దినాలను పెంచాలని డిమాండ్ చేశారు. 60 శాతం నిధులను కేంద్రం మంజూరు చేసి, మిగిలిన 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని చెప్పడం భావ్యం కాదన్నారు. కొత్త సాంకేతిక నిబంధనలతో గ్రామీణ ప్రాంతంలోని ఉపాధి కార్మికులు ఇబ్బందులు పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. వారికి ఇప్పటికే ఉపాధి వేతనాలు సకాలంలో అందడం లేదన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ అప్పుల ఊబిలో ఉందని గత, ప్రస్తుత పాలకులపై ఆమె విమర్శలు గుప్పించారు. ఒకరు మూడు రాజధానులు అంటే మరొకరు బ్రహ్మాండమైన రాజధాని కడతామని కథలు చెప్పారని, నేటికీ పూర్తిస్థాయిలో నిర్మాణం ఎక్కడా జరగలేదని, దేశంలో రాజధాని లేని ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని ఎద్దేవా చేశారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య ముమ్మాటికీ కడప ఎంపి టికెట్ విషయంలోనే జరిగిందని ఆరోపించారు. వివేకా బతికుంటే తనకు ఎప్పటికైనా అడ్డేనని అవినాష్ భావించిన క్రమంలోనే హత్య జరిగిందన్నారు. ఆ ఘటనను అడ్డుపెట్టుకుని జగన్ నాడు సిఎం అయ్యారని, ఐదేళ్లు ఆయన అధికారంలో ఉన్నా హత్య కేసును ఎందుకు కొలిక్కి తేలేకపోయారని ప్రశ్నించారు. 'అలాంటి అన్న ఉంటే శత్రువులు అవసరం లేదు.. అన్న అనే పదానికి జగన్ కళంకం' అని షర్మిల విమర్శించారు.

# యుద్ధ బీభత్సం

(మొదటిపేజీ తరువాయి)

తోసిపుచ్చిన కొన్ని గంటల వ్యవధిలోనే ఈ దాడి జరగడం గమనార్హం. ఇరాన్ దక్షిణ తీరంలోని బుషెర్ అణు విద్యుత్ కేంద్రం సమీపంలో కూడా దాడి జరిగింది. అయితే ఈ ఘటనలో ఎలాంటి రేడియేషన్ వెలువడలేదని, అలాగే నష్టం కూడా జరగలేదని రష్యా, ఇరాన్ అధికారులను ఉటంకిస్తూ అసోసియేటెడ్ ప్రెస్ తెలియజేసింది. అణు విద్యుత్ ప్లాంటులో ఉన్న మెట్రోలజీ సర్వీస్ భవనం సమీపంలో ఈ దాడి జరిగింది. ఈ దాడిపై తమకు ఇరాన్ సమాచారం ఇచ్చిందని ఐరాసకు చెందిన అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) చెప్పింది. పర్షియన్ గల్ఫ్ వెంబడి టెహ్రాన్‌కు దక్షిణంగా 750 కిలోమీటర్ల దూరంలో ఈ అణు శక్తి కేంద్రం ఉంది. ఇది ఇరాన్ నడుపుతున్న ఏకైక అణు శక్తి ప్లాంట్. రష్యా సాంకేతిక నిపుణుల సాయంతో దీనిని నిర్వహిస్తున్నారు. కాగా ఇరాన్‌లోని దొరుద్ నగరంపై జరిగిన తాజా దాడిలో ఏడుగురు చనిపోగా 56 మంది గాయపడ్డారు.

**చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో...**

యుద్ధంలో నేతలు, సైనికాధికారులను కోల్పోతున్నప్పటికీ ఇరాన్ చెక్కుచెదరని ఆత్మ విశ్వాసంతో పోరు సాగిస్తోంది. లారిజానీ హత్యకు ప్రతీకారంగా అనేక గల్ఫ్ దేశాలపై వివిధ రకాల వార్‌హెడ్లతో కూడిన క్షిపణులను, డ్రోన్లను ప్రయోగిస్తోంది. వాటిని అడ్డుకునేందుకు గల్ఫ్ దేశాలు ఆపసోపాలు పడుతున్నాయి. ఇజ్రాయిల్ గగనతల రక్షణ వ్యవస్థల కన్నుగప్పి భారీ నష్టాన్ని కలిగించే ఓ ఆయుధాన్ని ఇరాన్ ప్రయోగించినట్టు సమాచారం. ఇరాన్ ప్రయోగించిన ఖొర్రంషెహర్-4, ఖ్వాద్ క్షిపణుల కారణంగా ఖతార్, కువైట్, యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిలలో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. ఇరాన్ దాడులలో యూఏఈ బాగా దెబ్బతింటోందని, క్షిపణులు, డ్రోన్లు సహా ఇప్పటి వరకూ గల్ఫ్ దేశాలపై మూడు వేలకు పైగా దాడులు జరిగాయని అల్ జజీరా వార్తా సంస్థ ప్రతినిధి బస్రావీ తెలిపారు. వీటిలో సగం దాడులు యూఏఈని లక్ష్యంగా చేసుకొని జరిగినవే. దాడుల కారణంగా దుబాయిలోనే కాక గల్ఫ్ దేశాలలోని అనేక నగరాలలో దట్టంగా పొగలు కమ్ముకున్నాయి. గల్ఫ్‌లో అనేక మంది ప్రాణాలు కోల్పోయారని, ఆయా దేశాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలుస్తోంది. బాగ్దాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయం ప్రాంగణాన్ని ఓ క్షిపణి తాకింది. అయితే ఈ దాడికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. సౌదీ అరేబియాలో అమెరికా దళాలు, యుద్ధ విమానాలకు ఆశ్రయం కల్పిస్తున్న ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరంపై బాలిస్టిక్ క్షిపణి దాడి జరిగింది. యూఏఈలోని ఆస్ట్రేలియా సైనిక స్థావరంపై కూడా దాడి జరిగింది. ఈ ఘటనలో స్వల్పంగా మంటలు చెలరేగాయి.

**కువైట్ రాకుమారుడితో మాట్లాడిన మోడీ**

మధ్యప్రాచ్యంలో నెలకొన్న పరిస్థితులపై ప్రధాని నరేంద్ర మోడీ కువైట్ రాకుమారుడు సబహ్ అల్-ఖలీద్ అల్-హమద్ అల్-ముబారక్ అల్-సహబ్‌తో బుధవారం టెలిఫోన్‌లో సంభాషించారు. ఈ సందర్భంగా ఆయనకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. పశ్చిమాసియాలో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేశారు. కువైట్ సార్వ భౌమత్వంపై జరుగుతున్న దాడులను ఖండించారు. హార్ముజ్ జలసంధి మీదుగా చమురు నౌకలు స్వేచ్ఛగా ప్రయాణించేలా చూసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

**యుద్ధోన్మాదానికి బలవుతున్న చిన్నారులు**

లెబనాన్‌లో హెజ్బొల్లాను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులలో ప్రతి రోజూ అభం శుభం తెలియని చిన్నారులు బలవుతూనే ఉన్నారు. ఈ నెల 2వ తేదీ నుంచి ఇప్పటి వరకూ కనీసం 111 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోగా 334 మంది గాయాలపాలయ్యారు. మధ్యప్రాచ్యంలో ఇజ్రాయిల్, అమెరికాల యుద్ధోన్మాదానికి 1,200 మంది పిల్లలు చనిపోయారు. ఈ నేపథ్యంలో యుద్ధాన్ని వెంటనే నిలిపివేయాలని ఇరు పక్షాలకూ యూనిసెఫ్ సూచించింది.

**అమరులకు కన్నీటి వీడ్కోలు**

అమెరికా, ఇజ్రాయిల్ దాడులలో మరణించిన భద్రతా దళాల అధిపతి అలీ లారిజానీకి, నౌకాదళానికి చెందిన ఇతర అమరవీరులకు ఇరాన్ ఘనంగా నివాళులు అర్పించింది. వారి త్యాగాన్ని దేశం ఎన్నడూ మరవబోదని, అది రాబోయే కాలంలో సాయుధ దళాలకు మరింత శక్తిని అందిస్తుందని అంత్యక్రియలకు హాజరైన నేతలు కొనియాడారు. మృతవీరుల ఆత్మశాంతి కోసం ప్రజలు పెద్ద ఎత్తున ప్రార్థనలు జరిపారు. వారి సేవలను, అంకితభావాన్ని గుర్తు చేసుకుంటూ కన్నీటి వీడ్కోలు పలికారు.

**ఇరాన్ ప్రభుత్వం బలహీనపడలేదు : అమెరికాకు ఇజ్రాయిల్ రహస్య నివేదిక**

ఇరాన్ యుద్ధంపై అమెరికాకు ఇజ్రాయిల్ ఓ రహస్య నివేదికను అందజేసింది. ఇరాన్ ప్రభుత్వం బలహీనపడలేదని, తుది వరకూ పోరాడేందుకు సిద్ధంగా ఉన్నదని ఆ నివేదిక తెలిపిందని వాషింగ్టన్ పోస్ట్ పత్రిక వెల్లడించింది. ఇరాన్‌లో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలను అణచివేస్తున్నారని, నిరసనకారులను హతమారుస్తున్నారని ఆ నివేదిక ఆరోపించింది. ఇరాన్ నాయకత్వం ఇప్పుడప్పుడే అంతర్గతంగా కుప్పకూలే అవకాశాలు కానరావడం లేదని జెరుసలేంలోని అమెరికా రాయబార కార్యాలయానికి పంపిన నివేదికలో ఇజ్రాయిల్ అభిప్రాయపడింది. ఇరాన్ అంతర్గత భద్రతా యంత్రాంగం పటిష్టంగా ఉన్నదని తెలియజేసింది. ఆ నివేదిక ప్రకారం బసిజ్ వంటి దళాల మద్దతుతో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) బలంగా ఉంది.

**గుజరాత్ చేరిన చమురు నౌక**

భారత్‌కు చెందిన చమురు నౌక 'జగ్ లాడ్కీ' బుధవారం గుజరాత్‌లోని ముంద్రా ఓడరేవుకు చేరుకుంది. ఎల్పీజీతో హార్ముజ్ జలసంధి మీదుగా ప్రయాణించిన నౌకలు శివాలిక్, నందాదేవి ఇప్పటికే దేశానికి చేరిన విషయం తెలిసిందే. జగ్ లాడ్కి నౌకలో 80,886 మెట్రిక్ టన్నుల ముడి చమురు ఉంది.

**నేతలను కోల్పోతున్నా వెనక్కి తగ్గని ఇరాన్**

గత నెల28న మధ్యప్రాచ్యంలో మొదలైన యుద్ధం బుధవారం 19వ రోజుకు చేరింది. మొదటి రోజే సుప్రీం నేత అలీ ఖమేనీని, పలువురు సైనికాధికారులను ఇరాన్ కోల్పోయింది. ఇజ్రాయిల్, అమెరికా దాడులలో మంగళవారం భద్రతా దళాల అధిపతి లారిజానీ, బసిత్ దళాల కమాండర్ కమాండర్ సొలైమనీ చనిపోయారు. తాజాగా ఇంటెలిజెన్స్ మంత్రి ఖతీబ్‌నూ ఇరాన్ పోగొట్టుకుంది. అయినప్పటికీ అక్కడి నాయకత్వం ఏ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. అలీ ఖమేనీ హతమైనా ఆయన కుమారుడు మొజ్తాబా సుప్రీం నేత అయ్యారు. ఆయన నేతృత్వంలో ప్రతీకార దాడులు ఉధృతమయ్యాయి. క్షిపణులు, డ్రోన్లతో ఇజ్రాయిల్ పై, గల్ఫ్ దేశాలలోని అమెరికా ఆస్తులపై ఇరాన్ విరుచుకుపడుతోంది.

## రాహుల్, ప్రియాంక గాంధీతో
# సీఎం రేవంత్ రెడ్డి భేటీ

(మొదటిపేజీ తరువాయి)

ఆయనను కలిసిన వారిలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి, ఎంపీలు మల్లు రవి, సురేశ్‌షెట్కార్, రఘురాంరెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, కాంగ్రెస నేత రోహిన్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా కొత్తగా రాజ్యసభకు ఎంపికైన వేం నరేందర్ రెడ్డిని పరిచయం చేశారు. దాదాపు 10 నిమిషాలపాటు సీఎం, పీసీసీ చీఫ్ సహా ఎంపీలతో రాహుల్ గాంధీ మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, రాష్ట్ర బడ్జెట్, గిగ్ వర్కర్ల బిల్లు, ఇతర అంశాలపై చర్చించారు. ఆ తర్వాత మకర ద్వారం సమీపంలో ప్రియాంక గాంధీని సీఎం కలిశారు. తెలంగాణలో సమర్థవంతమైన పాలన, ఇతర అంశాలపై సీఎంను ప్రియాంక గాంధీ అభినందించారు.

అనంతరం వేం నరేందర్ రెడ్డిని సీఎం పరిచయం చేశారు. అంతకు ముందు తనకు పెద్దల సభకు అవకాశం కల్పించిన రాహుల్, ప్రియాంక గాంధీలకు వేం నరేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాజ్యసభ సభ్యుడిగా సంబంధించిన అన్ని డాక్యుమెంట్లను రాజ్యసభ సెక్రెటరీ విభాగంలో అందజేసినట్టు తెలిపారు. రాజ్యసభకు ఎన్నికైనందున ఎంపీగా తాత్కాలికమైన పార్లమెంట్ పాస్‌ను సీపీఐసీ ఇచ్చిందన్నారు. ఏప్రిల్ 10 లేదా ఆ తర్వాత ఆయన రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణం చేయనున్నట్టు చెప్పారు. అనంతరం సీఎంతో పాటు ఢిల్లీ పర్యటన ముగించుకొని హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు.

# విజన్‌తో ముందుకెళ్తాం

(మొదటిపేజీ తరువాయి)

ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ గవర్నర్ శివప్రతాప్ శుక్లా చేసిన ప్రసంగం చారిత్రాత్మకమని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. గత చరిత్రను అనుభవాలుగా మార్చుకుంటూ భవిష్యత్ ప్రణాళికను దృష్టిలో పెట్టుకుని గవర్నర్ ప్రసంగం తయారు చేశారన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 11.5 శాతం వడ్డీకి అప్పు తెస్తే కేంద్రం చుట్టూ తిరిగి దాన్ని 7.5 శాతం తగ్గించుకున్నామనీ, పార్టీ పరంగా సైద్ధాంతికంగా విభేదాలున్నప్పటికీ ఈ విషయంలో సహకరించిన నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్ ఇచ్చిన మూడు నెలల్లో పరీక్షలు ఎందుకు నిర్వహించలేదని విమర్శించారు. నోటిఫికేషన్లు వేయడం, కోర్టులకు ఎక్కేలా చేయడం, నిరుద్యోగులను ఇబ్బందులకు గురిచేయడం ఆనాడు షరామామూలుగా జరిగిందన్నారు. అదే బంధువు, కుటుంబ సభ్యురాలు ఎంపీగా ఓడిపోతే మూడు నెలల్లో వారికి పోస్టులు ఇచ్చారని ఎద్దేవా చేశారు. తమ పాలనలో 80వేలకు పైగా ఉద్యోగాలను భర్తీచేశామని నొక్కి చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం విషయంలో ప్రతిపక్షం కలిసి వస్తుందని భావించినా...వారి అహంకార ధోరణి ఇంకా పోలేదని విమర్శించారు. ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. అధికారం పోయినా ఇంకా తామే రాజులమనే భావనతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారనీ, రాచరికంలో వారసత్వానికి అవకాశం ఉందిగానీ ప్రజాస్వామ్యంలో దానికి ఆస్కారం లేదని స్పష్టం చేశారు. తెలంగాణతల్లి ఆవిష్కరణకు ప్రధాన ప్రతిపక్ష నేత వస్తారని ఆశిస్తే నిరాశే మిగిలిందన్నారు. ప్రజలు బుద్ధి చెప్పి ప్రతి పక్షంలో కూర్చోబెట్టినా అదే అహంకార పూరిత ధోరణి వ్యవహరిస్తున్నారని తెలిపారు. 2023 డిసెంబర్ నుంచి ఇప్పటిదాకా జీతం రూపంలో కోటీ ఆరు లక్షల రూపాయలు తీసుకున్న వ్యక్తి సభకు గైర్హాజరు కాకపోవడం సరిగాదనీ, విధులకు హాజరుకాకుండా ఉన్నవారిపై చర్చ జరగాల్సిన అవసరం ఉందని చెప్పారు.

ముందు చూపుతో స్వాతంత్ర్యం సిద్ధించిన తొలినాళ్లలో జవహర్‌లాల్ నెహ్రూ ప్రణాళికలతో ముందుకెళ్లడం, ఆ తర్వాత ఇందిరాగాంధీ, రాహుల్‌గాంధీ, పీవీ నర్సింహారావు, మన్మోహన్‌సింగ్ తీసుకున్న కీలక నిర్ణయాలు, సంస్కరణలు ప్రపంచం ముందు భారత్‌ను ఒక శక్తివంతమైన దేశంగా నిలబెట్టాయన్నారు. పేదలకు ఇండ్లు, ఇండ్లస్థలాలు ఇచ్చిన, సీలింగ్, అసైన్డ్ భూములు పంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వా లదేనన్నారు. వారి వ్యూహాత్మక ఎత్తుగడలతోనే నేడు ప్రపంచంలోని దిగ్గజ కంపెనీలకు మన దేశం వారు సీఈఓలుగా ఉన్నారని గుర్తుచేశారు. సిలికాన్ వ్యాలీలో మన తెలుగువాళ్లు రాణించడానికి కారణం రాహుల్‌గాంధీ, పీవీ, మన్మోహన్‌సింగ్ తీసుకున్న సంస్కరణలే కారణమని వివరించారు. నేదురుమల్లి జనార్థన్‌రెడ్డి హైదరాబాద్‌లో హైటెక్ సిటీకి శంకుస్థాపన చేస్తే చంద్రబాబు ముందుకు తీసుకెళ్లారని తెలిపారు.

**ఆక్రమణలు తొలగించడం...**
**నాలాలను రక్షించడం ఇష్టం లేదా?**

తాము మూసీ సుందరీకరణ చేస్తామంటే ప్రతిపక్షం అడ్డుపడుతామని చెప్పటాన్ని సీఎం తప్పుబట్టారు. ఆక్రమణలు తొలగించడం, పరిశ్రమలు తరలించడం, చెరువులు, నాలాలను పరిరక్షించడం లాంటి మంచి చేయొద్దా? అని నిలదీశారు. కాలుష్యంతో రాజధాని ఢిల్లీ, వర్షాల ఎఫెక్ట్‌తో ఫైనాన్సియల్ రాజధాని ముంబై, ట్రాఫిక్ సమస్యతో బెంగుళూరు నగరాలు కూరుకుపోవడంతో ఐటీ, తదితర రంగాల పరిశ్రమలు తెలంగాణ వైపు చూస్తున్నాయని వివరించారు. నల్లచెరువును హైడ్రా రక్షిస్తే ప్రజలు బ్రహ్మరథం పట్టారనీ, ఉమర్‌ఉద్దౌల్లా చెరువు పునరుద్ధరిస్తే ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయని చెప్పారు. తుమ్మిడి కుంటను ప్రముఖ సినీస్టార్ అక్రమించుకుంటే ఆక్ర మణలు తొలగించి చెరువును కాపాడామనీ, రియల్టర్ల కబ్జా నుంచి సున్నం చెరువును రక్షించుకున్నా మని వివరించారు. బేగంపేటలో 200 ఫీట్ల ఉన్న నాలా 30 ఫీట్లకు కుచించుకుపోయిందనీ, హైదరాబాద్ నగరాన్ని కొంత మంది దురాశపరులు ఆమ్రణలకు పాల్పడితే కాడపాడుతున్నామని నొక్కి చెప్పారు. ఇలా మంచి పనులు చేస్తుంటే అడ్డుకోవడమేంటని నిలదీశారు. హైదరాబాద్ నగరంలో నాలాలపై 28వేల అక్రమ కట్టడాలున్నాయనీ, చట్టం ఎలాంటి నోటీసులు లేకుండా కూల్చేయాలని చెబుతున్నదని కేసీఆర్ అనలేదా? ప్రశ్నించారు. డ్రోన్లతో, మ్యానువల్‌గా సర్వేలు చేయించి అక్రమ కట్టడాలను జేసీబీలతో కూల్చేస్తామని కేటీఆర్ చెప్పలేదా? అని నిలదీశారు. మూసీలో కంటే వీళ్ల కడుపులో ఎక్కువ విషం ఉందని విమర్శించారు.

# సంపాదకీయం

## నట్టింట్లో కల్తీ రక్కసి



**భా**రతదేశంలో ఆహార కల్తీ రక్కసి కోరలు చాస్తున్నది. యేటా దేశవ్యాప్తంగా కల్తీ ఆహారం కారణంగా సుమారు 70 వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారనే చేదు నిజాన్ని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నివేదిక ప్రకారం.. భారత్‌లో యేటా 10 కోట్ల మంది కల్తీ ఆహారం తీసుకుని అనారోగ్యానికి గురవుతున్నారు. ఇందులో 20 శాతం మంది ఆసుపత్రుల పాలవుతున్నారు. ఫలితంగా నిల్వ ఉంచిన కలుషిత ఆహారం కొనుక్కుని తిని మరీ ప్రజలు రోగాలను కొనితెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఈ పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. ఆహార భద్రతా ప్రమాణాల అమలులో ఆంధ్రప్రదేశ్ గత ఐదేళ్ల కాలం లో అట్టడుగు స్థానానికి పడిపోయింది. తెలుగు రాష్ట్రాల్లో పాల కల్తీ నిరంతరాయంగా సాగుతున్న ఒక ప్రమాదకర వ్యాపారంగా మారింది. పసి పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి రోజూ వినియోగించే పాలు ఇప్పుడు విషపూరిత రసాయనాలతో నిండిపోతున్నాయి. పాల సాంద్రత పెంచేందుకు గంజి పొడిని వాడుతున్నారు. వంటగదిలో నిత్యం వినియోగించే పదార్థాలు, మసాలాలన్నీ ఇప్పుడు కల్తీ కాటుకు గురవుతున్నాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తోపాటు ప్రధాన పట్టణాల్లో తరచూ 'కల్తీ'కారుల అక్రమాలు వెలుగు చూడటం ఆందోళన కలిగిస్తున్నది. ఇటీవల మైలార్‌దేవ్‌పల్లి, లాలాగూడల్లో అపరిశుభ్ర వాతావరణంలో తయారవుతున్న కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ కేంద్రాలపై పోలీసులు జరిపిన దాడులు ఒక ఎత్తయితే, బంజారాహిల్స్ వంటి సంపన్నుల నివాస ప్రాంతంలో 'ఫ్రైడ్ డెయిరీ' పేరిట సాగుతున్న కల్తీ నెయ్యి దందా మరో ఎత్తు.కేవలం అల్లం వెల్లుల్లి, నెయ్యి మాత్రమే కాదు.. మనం నిత్య ఇంట్లో వినియోగించే పాలు, కారం, నూనె నుంచి టీ పొడి చివరకు.. ప్రతీది నకిలీమయం అవుతుండటం ఆందోళనకరం. శంషాబాద్ జోన్ పరిధిలోని జల్‌పల్లి, పహాడీషరీఫ్ ప్రాంతాల్లో పట్టుబడి న కల్తీ పదార్థాల తయారీ కేంద్రాలను పరిశీలిస్తే, ఆహార భద్రత ప్రమాణాలను గాలికొదిలేసి, లాభార్జనే ధ్యేయంగా దందా సాగినట్లు స్పష్టమ వుతున్నది. కల్తీల వెనుక వాస్తవాలు అత్యంత దారుణంగా ఉన్నాయి. అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీలో అక్రమార్కులు కుళ్లిన అల్లం, తక్కువ నాణ్యత గల వెల్లుల్లికి తోడు.. జిగురు కోసం ప్రమాదకరమైన 'ఎక్స్‌జన్ గమ్ పౌడర్', రంగు కోసం సింథటిక్ రసాయనాలు, నిల్వ ఉండటానికి అధిక మోతాదులో సిట్రిక్ యాసిడ్ వాడినట్లు అధికారులు గుర్తించారు. ఈ పదార్థాలు మనిషి శరీరంలోకి వెళితే జీర్ణకోశ వ్యాధుల నుంచి మొదలుకొని దీర్ఘకాలంలో క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంది.కల్తీ నెయ్యి విషయానికొస్తే, అక్రమార్కులు తక్కువ ధరకు లభించే పామాయిల్, డాల్డా, హైడ్రోజనేటెడ్ వెజిటబుల్ ఫ్యాట్స్‌ను ఆవు, గేదె పాల మీగడలో కలిపి తమదే స్వచ్ఛమైన నెయ్యి అని మార్కెట్లోకి వదులుతున్నారు. పాల ను చిక్కగా మార్చేందుకు వీరు యూరియా, డిటర్జెంట్ పొడి, గ్లూకోజ్, స్టార్చ్ పౌడర్లు వాడుతున్నట్లు తేలింది. ఈ నెయ్యిని వినియోగిస్తే కాలేయం దెబ్బతినడం, మూత్రపిండాల వైఫల్యం, గుండె సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.అసలు ఈ కల్తీ మహమ్మారి ఇంతలా వేళ్లూనుకోవడానికి మారుతున్న జీవనశైలే ప్రధాన కారణమని విశ్లేషకులు చెప్తున్నారు. ఆధునిక కాలంలో 'ఇన్‌స్టంట్ ఫుడ్'పై మోజు, ఏ వంట అయి నా త్వరగా సిద్ధమైపోవాలనే ఆతృత.. కల్తీ కేటుగాళ్లకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఇంట్లో అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేసుకునే ఓపిక లేకపోవడం, ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ యాప్స్ ద్వారా వచ్చే ఆకర్షణీయమైన ఆఫర్ల వెంట పడటం వల్ల మనం తెలియకుండానే విషాన్ని కొని తెచ్చుకుంటున్నాంతక్కువ ధరకే దొరుకుతున్నాయని నాణ్యతను పట్టించుకోకుండా రోడ్డు పక్కన విక్రయించే విడి అల్లం పేస్ట్‌లు, లోకల్ బ్రాండ్ నెయ్యి ప్యాకెట్లను ఆశ్రయించడం ప్రాణాంతకం. హోటళ్లు, ఫంక్షన్ హాళ్లలో లాభాల కోసం ఇలాంటి కల్తీ ఉత్పత్తులనే వాడుతున్నట్లు యంత్రాంగం విచారణలో తేల డం గమనార్హం. కేవలం పోలీసుల దాడులు, అరెస్టులతోనే ఈ వ్యవస్థ ప్రక్షాళన కాదు. వినియోగదారులు కూడా అప్రమత్తంగా ఉండాలిసాధ్యమైనంత వరకూ ఇంట్లో తయారు చేసుకునే పదార్థాలనే, వినియోగించు కోవడం ఉత్తమం. అధిక లాభాల కోసం సామాన్యుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీ ముఠాలపై ప్రభుత్వాలు కఠిన చట్టాలను ప్రయోగించి, కల్తీ మహమ్మారికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.పాలు తెల్లగా కనిపించేందుకు అక్రమార్కులు వైట్ పెయింట్ ను ఉపయోగిస్తున్నారు. నిల్వ ఉంచేందుకు ఫార్మాలిన్ వంటి రసాయనాలను వాడుతున్నారు. కేవలం లాభాపేక్షే ధ్యేయంగా నకిలీ పాల రైతులు అవతారమెత్తి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఒక పాడి గేదె పెంపకం దారు వద్ద రెండు మూడు గేదె లు ఉంటే 20 నుంచి 30 మంది వినియోగదారులు ఉంటున్నారు.ఈ అదనపు పాలు ఎక్కడ నుంచి వస్తున్నాయో దేవుడికే తెలియాలి. బజారుకొకటి ఉంటున్న ప్రైవేట్ పాల కేంద్రాలు కాస్త కొద్దీ పాలను విక్రయిస్తున్నాయి. ఈ కేంద్రాల్లో యూరియా బస్తా ల నిల్వలు కనిపిస్తున్నాయి. పంటలకు దొరకని యూరియా ఇక్కడ నిల్వ ఉండటం వెనుక అసలు పరమార్థం ఇదే.ల కల్తీ కోసం అక్రమార్కులు యూరియా, ఫార్మాలిన్, డిటర్జెంట్లు, అమ్మోనియం సల్ఫేట్, కాస్టిక్ సోడా వంటి భయంకరమైన రసాయనాలను ఉపయోగిస్తున్నారు. పాల సాంద్రతను పెంచేందుకు గంజి పొడిని కలుపుతున్నారు. నీళ్లు కలిపిన పాలు చిక్కగా కని పించేందుకు సబ్బును ఉపయోగిస్తున్నారు. వైట్ పెయింట్ ని పాలలో కలపడం కల్తీ దారుల మితిమీరిన తెలివికి నిదర్శనం. వీటివల్ల మూత్రపిండాల వ్యాధులు, క్యాన్సర్, జీర్ణకోశ సమస్యలు తలెత్తుతున్నాయి. ఫార్మాలిన్ రసాయనం కాలేయం, మూత్రపిండాలపై హానికరమైన ప్రభావాన్ని చూపు తుంది.పాలలో లాక్టోమీటర్ పరీక్షలతో కూడా గుర్తించలేని విధంగా కార్బోహైడ్రేట్లు కలుపుతున్నారు. ఇంతటి ప్రమాదకర స్థితి నుంచి ప్రజలను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆహార భద్రతా శాఖతో తరచూ ఆకస్మిక దాడులు నిర్వహించి కల్తీకి పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలి. లేనిపక్షంలో సామాన్య ప్రజలు రోగాలపాలై అర్ధాంతరపు చావులకు గురికాక తప్పదు.

# ఉగాది కానుకగా "దివ్యాంగ శక్తి"

- దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం
- "దివ్యాంగ శక్తి"ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్ భాషా



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టింది. ఇందులో భాగంగానే ఉగాది కానుకగా 'దివ్యాంగశక్తి' పేరుతో దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రవేశపెట్టింది. మదనపల్లి ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో బుధవారం "దివ్యాంగ శక్తి" (దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం) కార్యక్రమాన్ని ప్రారంభించే కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్ భాష తదితరులు.

మదనపల్లి ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో బుధవారం "దివ్యాంగ శక్తి" (దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం) కార్యక్రమాన్ని ప్రారంభించే కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్ భాష పచ్చజెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించి,ఆ బస్సు పాసులను, జీరో బస్సు టికెట్లను స్వయంగా దివ్యాంగులకు అందజేశారు. దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణిస్తూ వారితో సెల్ఫీ దిగారు. అనంతరం వారి సమస్యలను, వారి అభిప్రాయాలను తెలుసుకొని సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని పిజిఆర్ఎస్ సమావేశం మందిరంలో దివ్యాంగులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ రోజు నుండిదివ్యంగ శక్తి అమలు లోనికి రావడం ద్వారా 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులకు ఈ పథకం వర్తించనుంది. పల్లెవెలుగు, ఎక్స్ప్రెస్. మెట్రో ఎక్స్ ప్రెస్, ఆర్డినరీ, సిటీ బస్సుల్లో దివ్యాంగులు ఇకపై ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. ఇప్పటికే మహిళలకు. ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు దివ్యాంగులకు అవకాశం ఇవ్వడంతో సంతోషదాయకమని ఈ పథకం ద్వారా జిల్లాలో సదరం ద్వారా 40 శాతం కంటే ఎక్కువ వికలత్వం ఉన్న వారు 42,560 మంది దివ్యాంగులు ఉన్నారు. వీరంతా కూడా ఆర్టీసీలో దివ్యాంగశక్తి పథకం కింద ప్రయాణించవచ్చు.. ప్రభుత్వ సదుపా యాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

ఈ సందర్భంగా మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్ భాష మాట్లాడుతూ..ప్రభుత్వం వికలాంగుల సంక్షేమానికి కట్టుబడి ఉందని వికలాంగులకు పెన్షన్లు అందిస్తున్నామని, అదేవిధంగా ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం మరో ముఖ్య నిర్ణయం తీసుకొని "దివ్యాంగ శక్తి" పథకం దివ్యాంగుల జీవితాల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే కీలక కార్యక్రమమని వారికి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందన్నారు. వికలాంగులు ఎక్కడికైనా నిరభ్యంతరంగా ప్రయాణించేందుకు ఫ్రీ బస్ పాస్ సదుపాయం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇది దేశంలోనే అరుదైన విషయమని ఇతర రాష్ట్రాల్లో కనిపించని ప్రత్యేక పథకమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని, ముఖ్యంగా ఫిజికల్‌గా ఛాలెంజ్ ఉన్న వ్యక్తులకు భద్రత, ఆత్మవిశ్వాసం కల్పించడం తమ బాధ్యతగా ఈ ప్రభుత్వం భావిస్తున్నదని చెప్పారు. వికలాంగులు ఎలాంటి భయం లేకుండా సమాజంలో స్వేచ్ఛగా జీవించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటు అందిస్తుందని స్పష్టం చేశారు.ఈ పథకం ద్వారా వికలాంగుల జీవన ప్రమాణాలు మెరుగు పడటంతో పాటు, వారి రోజువారీ అవసరాల కోసం ప్రయాణం సులభతరం అవుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సదుపాయాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రెండవ డిపో మేనేజర్ అమరనాథ్, వెలుగు సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్ రెడ్డి,దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మౌలాలి, టిడిపి నాయకులు నవీన్ చౌదరి, బాలు స్వామి, బొమ్మిశెట్టి పురుషోత్తం, జంగాల వెంకటరమణ, కమలామగ్రి కృష్ణ, ముసలికుంట నాగయ్య, మండిపల్లి మధుసూదన్ రెడ్డి, యర్రబల్లి వెంకటరమణా రెడ్డి, బోనాసి జాన్ బాబు, చల్లా నరసింహులు, బాబు నాయుడు, జీవి నాయుడు, రాధమ్మ, పులి మహాలక్ష్మీ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

**ఉరవకొండలో..** ఉరవకొండ ఏపియస్ ఆర్టీసీ



ప్రాంగణంలో దివ్యాంగుల కోసం ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ పథకం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పంతో అమలు జరుగుతున్న ఈ పథకాన్ని అధికారులు, స్థానిక నాయకులు ప్రారంభించారు. ఈ పథకం దివ్యాంగులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వారు తెలిపారు. దీని ద్వారా దివ్యాంగులు సులభంగా, ఉచితంగా ప్రయాణించ వచ్చు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ విజయభాస్కర్ టీడీపీ సినియర్ నాయకులు పేరం కేశవ, మోపిడి గోవింద్, నాయకులు కార్యకర్తలు పాల్గొని దివ్యాంగ్ శక్తి పథకాన్ని ప్రారంభించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి, నారా లోకేష్‌కి స్థానిక ఎమ్మెల్యే ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కి కూటమి నాయకులకి కృతజ్ఞతలు తెలియజేసారు.

**పెళ్లకూరులో...** సమసమాజ నిర్మాణమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి మరో కీలక నిర్ణయం తీసుకుని "దివ్యాంగ శక్తి" పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా బుధవారం ప్రారంభించింది. గత డిసెంబర్‌లో గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు ఈ పథకం అమలులోకి రావడం విశేషం. ఉగాది కానుకగా అందించిన ఈ పథకం ద్వారా దివ్యాంగులకు ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో పూర్తిగా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ స్థానిక బస్టాండ్‌లో రిబ్బన్ కట్ చేసి పథకాన్ని ఘనంగా ప్రారంభించారు. అనంతరం బస్సులో ప్రయాణిస్తున్న దివ్యాంగులకు ఉచిత టికెట్లను అందజేసి, పచ్చజెండా ఊపి బస్సును ప్రారంభించారు.

ఈ పథకం ద్వారా పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్ప్రెస్ వంటి అన్ని ప్రధాన బస్సు సేవల్లో దివ్యాంగులు ఎటువంటి ఛార్జీలు లేకుండా ప్రయాణించవచ్చు. ఇది దివ్యాంగుల ఆర్థిక భారం తగ్గించడమే కాకుండా, వారి స్వేచ్ఛాయుత సంచారానికి దోహదపడుతుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ఆకుతోట రమేష్, టీడీపీ నేతలు తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఎఫ్ ఎస్ సి ఎస్ చైర్మన్ ఏజీ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ, దివ్యాంగుల జీవనోపాధి మెరుగుపర్చడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తుందని, ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుందని పేర్కొన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలోని దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.



## దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం

- 'దివ్యాంగ శక్తి' పథకంను ప్రారంభించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి
- ఆత్మగౌరవ జీవనానికి బలమైన అడుగు
- సంక్షేమానికి సరికొత్త రూపం
- ప్రతి దివ్యాంగుడికి స్వేచ్ఛగా ప్రయాణించే హక్కు



**అన్నమయ్య బ్యూరో– సూర్య వాస్తవం:** రాయచోటి లోని ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ నందు జరిగిన సమాన అవకాశాలతో ముందుకు సాగే సమాజం నిర్మాణం "దివ్యాంగ శక్తి" నమ్మకానికి, స్వావలంబనకు, గౌరవానికి ప్రతీక అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాం ప్రసాద్ రెడ్డి అన్నారు ఈ కార్యక్రమంలో నియోజక వర్గం నందలి దివ్యాంగ సోదర, సోదరీమణులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు, సంబంధిత అధికారులు, బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్చార్జులు, మండల పార్టీ,గ్రామ పార్టీ అధ్యక్షులు, టిడిపి ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేటి నుంచి పెద్ద పీరయ్య స్వామి ఆరాధన మహోత్సవాలు

**బ్రహ్మంగారిమఠం – సూర్య వాస్తవం :** జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి శిష్యులు శ్రీ సిద్దయ్య స్వాములవారి కుమారుడు పెద్ద పీరయ్య స్వాములవారి ఆరాధన మహోత్సవాలు భక్తజన ద్రవ్య సహాయమున ప్రతిఏటా తెలుగు సంవత్సరాది (ఉగాది) పండగ రోజున జరుపబడును పరాభవనామ సంవత్సర చైత్ర శుద్ధ పాడ్యమి గురువారము నుండి వీరయ్య స్వామి ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించబడును. ఉదయం 10 గంటలకు పూల పూజ మధ్యాహ్నం 12 గంటలకు సిద్దయ్య స్వామికి పెద్ద పేరయ్య స్వామి వారికి వస్త్రాలంకరణ రాత్రికి గ్రామోత్సవం నిర్వహించబడును కావున భక్తాదులందరూ ఈ ఉత్సవంలో పాల్గొని స్వామివారిని సేవించి తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు లగుదలని ఆలయ నిర్వహకులు తెలిపారు. స్వామి వారి దర్శనార్థం వచ్చు భక్తులకు పుట్టా సుధాకర్ యాదవ్ నిర్మించిన యాదవ అన్న సత్రంలో యాదవ అన్న సత్రం నందు అన్న ప్రసాద వితరణ కలదు మరియు రాత్రి 10 గంటలనుండి గోపాల్ బృందం వారిచే రేలారే రేలా కార్యక్రమం కలదు. అంతేకాకుండా చిన్నాయ పల్లె గ్రామస్తులు సహకారంతో సినీ ఆర్కెస్ట్రా ఏర్పాటు చేయడమైనది. అని ఆలయ నిర్వహకులు తెలిపారు.

## ఏపీ మోడల్ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం:** ఏపీ మోడల్ కళాశాలలో 2026-27 సంవత్సరానికి సంబంధించిన ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశం కొరకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వరాల రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మార్చిలో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఈనెల 18వ తేదీ నుంచి ఏప్రిల్ నెల 30 తేదీ వరకు దరఖాస్తులు ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు ఏపీ మోడల్ స్కూల్ నందు అప్పగించాలని ఆయన తెలిపారు. వివరాలు కోసం ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు.

## రంజాన్ తోఫా పంచిన బాబావలి



**ప్రొద్దుటూరు– సూర్య వాస్తవం:** ముస్లింల పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ప్రతీ పేద వారు పండుగ జరుపుకోవాలన్న సదుద్దేశంతో పెద్ద మనసుతో బాబా వలి రంజాన్ తోఫా అందిస్తున్నట్టు షేక్ డెవలప్ మెంట్ రాష్ట్ర చైర్మన్ వి ఎస్ ముక్తియార్, కొత్తపల్లి సర్పంచ్ కొని రెడ్డి శివ చంద్రా రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని అమృత నగర్ లో బాబావలి 400 మందికి నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముక్తియార్, శివ చంద్రారెడ్డి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలందరూ పండుగ జరుపుకోవాలన్న కాంక్షతో ఈ కార్యక్రమంలో మహిళలందరికీ కానుక అందించడం సంతోషదాయకం అన్నారు. ఈనెల రంజాన్ నెల ఈ నెల చివరలో ఈద్ ఉల్ ఫితర్ పండుగ జరుపుకుంటారని, రంజాన్ నెలలో దివ్య ఖురాన్ అవతరించిన నెల అన్నారు. జనజీవనానికి సంబంధించిన తల్లిదండ్రులు అన్నదమ్ములు చెల్లెళ్లు భార్యాభర్తలు బంధుత్వము స్నేహితులు ప్రజలు ఎలా కలిసి మెలిసి ఉండాలని ఖురాన్ సూచిస్తుందన్నారు. ఎన్ని పుణ్యాలు చేసుకుంటే అంత స్వర్గానికి వెళతారని మన ప్రవక్త చెప్పారన్నారు. ఎప్పుడు కూడా మనిషికి మనిషికి సహాయ పడేలా జీవించాలని, దుర్మార్గులు మాదిరిగా జీవించకూడదని హితవు పలికారు.దాదాపు ఇక్కడ 400 మందికి రంజాన్ తోఫా మా చేతుల మీద ప్రజలకు అందించడం ఆనందదాయకం అన్నారు. అమృత నగర్ ప్రజలందరికీ అందరికి ధన్యవాదాలు తెలిపారు.

## అశ్రునయనాల మధ్య జవాన్ అంత్యక్రియలు



**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి మండలం శ్రీపురం గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ ఆంజనేయులు అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్మీ అధికారులు, స్థానిక పోలీసులు హాజరై ఆంజనేయులు పార్థివదేహా నికి పూలమాలలు సమర్పించి, గౌరవ వందనం చేశారు. శ్రీపురంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. కుటుంబ సభ్యులు కన్నీటితో వీడ్కోలు పలికారు.

# నేడు టీడీపీ కార్యాలయంలో పంచాంగ శ్రవణం

## - వైభవంగా ఉగాది మహోత్సవం



పులివెందుల - సూర్య వాస్తవం : నేడు శ్రీ పరాభవనామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకుని, గురువారం ఉదయం 9:00 గంటలకు పులివెందుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 'ఉగాది మహోత్సవ కార్యక్రమం' అత్యంత వైభవంగా, పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి ఆధ్వర్యంలో జరగనున్న ఈ వేడుకలో భాగంగా, ప్రముఖ పురోహితులు బ్రహ్మశ్రీ పంచాంగం రామ్ కుమార్ శర్మ 'పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ కార్యక్రమానికి విచ్చేసే కూటమి నాయకులు, కార్యకర్తలు అందరూ తప్పనిసరిగా సాంప్రదాయ పంచె కట్టు ధరించి రావాల్సిందిగా మనవి తెలుపుతూ, పులివెందుల నియోజకవర్గంలోని కూటమి శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ ఉగాది మహోత్సవాన్ని విజయవంతం చేయాలని పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి పిలుపునిచ్చారు.

# కొనసాగుతున్న గ్యాస్ కష్టాలు



పులివెందుల - సూర్య వాస్తవం : పులివెందుల నియోజకవర్గం పరిధిలో ముఖ్యంగా పులివెందుల టౌన్ లో గ్యాస్ కష్టాలు కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష సమావేశాలు నిర్వహించి రెండు రోజుల్లోనే గ్యాస్ బుక్ చేసిన వెంటనే గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తామని చెప్తున్నారు. కానీ పులివెందులలో మాత్రం అందుకు విరుద్ధంగా వినియోదారుడు గ్యాస్ సిలిండర్ బుక్ చేసిన వెంటనే అతనికి డెలివరీ అయినట్టు మెసేజ్ కూడా పంపిస్తున్నారు. కానీ గ్యాస్ సిలిండర్లు అందడం లేదు. అదేమని ప్రశ్నిస్తే తిక్క తిక్క సమాధానం చెబుతున్నారని వినియోగదారులు వాపోతున్నారు. అంతేకాక పలుకుబడి కలిగిన పెద్దలు, పార్టీ నాయకులు, పోలీసులు రెవెన్యూ అధికారులకు మాత్రం కావాల్సిన సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ఈ విషయమై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# హెచ్‌పివి వ్యాక్సిన్ సద్వినియోగం చేసుకోవాలి

## - బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్



వేంపల్లె - సూర్య వాస్తవం : గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఉచిత హెచ్ పివి వ్యాక్సిన్ ని సద్వినియోగం చేసుకోవాలని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ కోరారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పిహెచ్సి వైద్యులు డా.శాంతి సుశేన్, డా.పృధ్వీకుమార్ రెడ్డి ల పర్యవేక్షణలో 14-15 ఏళ్ల మధ్య బాలికలకు హెచ్ పివి వ్యాక్సినేషన్ చేశారు. అనంతరం గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ హెచ్ పివి వ్యాక్సిన్ కిషోర బాలికలకు వరం లాంటిదని, వీటిని సద్వినియోగ పరుచుకుని, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారిన పడకుండా ఉండేందుకు రక్షణ అని అన్నారు. ఈ వ్యాక్సిన్ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ తో పాటు ఇతరత్రా క్యాన్సర్ లను నివారించే అత్యంత ప్రభావంతమైందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిహెచ్ఓలు వెంకటరత్నం, సూపర్వైజర్లు ఫకృద్దీన్, అరుణాదేవి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# రంగనాథ స్వామి దేవస్థానం ముఖద్వార తలుపులకు పాలిష్



పులివెందుల - సూర్య వాస్తవం : పులివెందుల పట్టణంలోని అతి పురాతనమైన దేవస్థానం రంగనాథ స్వామి దేవస్థానం ముఖద్వారానికి 2018లో పులివెందుల టిడిపి మాజీ పట్టణ అధ్యక్షుడు నాలుగు లక్షల 30 వేల రూపాయలు సంత నిధులతో టేకు తలుపులు చేయించారు. ఉగాది పండుగను పురస్కరించుకొని వాటికి గత మూడు రోజుల నుండి పాలిష్ పనులను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం మాజీ పట్టణ అధ్యక్షుడు బ్రాహ్మణపల్లి వెంకట రామిరెడ్డి పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో రూ.4 లక్షల 30 వేల వ్యయంతో తలుపులు చేయించడం జరిగిందన్నారు. ఉగాది పండుగను పురస్కరించుకొని వాటికి సొంత నిధులతో పాలిష్ పన్నులు చేయించడం జరుగుతుందన్నారు. దాదాపు వీటికి రూ.50 వేలు ఖర్చవుతున్నట్లు ఆయన తెలిపారు.

# స్థానిక ప్రభుత్వాలకు సకాలంలో ఎన్నికలను నిర్వహించకపోవడం అప్రజాస్వామికం

- చట్టవిరుద్ధం, రాజ్యాంగ ఉల్లంఘన
- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



వేంపల్లె - సూర్య వాస్తవం : స్థానిక ప్రభుత్వాలకు సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడం అప్రజా స్వామికం, చట్టవిరుద్ధం, రాజ్యాంగ ఉల్లంఘన అవుతుందని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో 17 మున్సిపల్ కార్పొరేషన్లు, 78 పురపాలక సంఘాలు, 29 నగర పంచాయతీలు ఉన్నాయన్నారు. ఇందులో 11 మున్సిపల్ కార్పొరేషన్లకు, 75 మున్సిపాలిటీలకు నగర పంచాయతీలకు నిన్నటి రోజుతో అనగా 2026 మార్చి 17తో పాలకవర్గాల కాలపరిమితి ముగిసింది. మార్చి 18 బుధవారం నుంచి ప్రత్యేక అధికారుల పాలనలో వచ్చింది. 74వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం పాలకవర్గాల కాలపరిమితి ముగిసేలోపు వీటికి ఎన్నికలను నిర్వహించాల్సిన బాధ్యత రాష్ట్ర ఎన్నికల కమిషన్ మీద, రాష్ట్ర ప్రభుత్వం మీద ఉంది. ఎన్నికలు సకాలంలో నిర్వహించకపోవడం రాజ్యాంగ ఉల్లంగనే అవుతుందని తులసి రెడ్డి అన్నారు. అలాగే రాష్ట్రంలో 13,324 గ్రామపంచాయతీలు ఉన్నాయి. 2026 ఏప్రిల్ రెండవ తేదీతో వీటి పాలకవర్గాల కాల పరిమితి ముగుస్తుంది. 73వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం 2026 ఏప్రిల్ 2 లోపల గ్రామపంచాయతీ లకు ఎన్నికలు నిర్వహించాలి.కానీ దురదృష్టవశాత్తు ఆ ప్రయత్నాలు జరగడం లేదు. గ్రామపంచాయతీలకు కూడా ప్రత్యేక అధికారులను నియమించి యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు కనిపిస్తుంది. ఇది రాజ్యాంగ ఉల్లంగనే అవుతుంది. రాష్ట్రంలో 13 జిల్లా పరిషత్తులు, 688 మండల ప్రజా పరిషత్తులు ఉన్నాయి. వీటి కాలపరిమితి 2026 సెప్టెంబర్ 24 తో ముగుస్తుంది. 73వ రాజ్యాంగ సవరణ ప్రకారము ఆ లోపల జిల్లా పరిషత్తులకు, మండల పరిషత్లకు ఎన్నికలు నిర్వహించాలి. ఆ ఉద్దేశం ప్రభుత్వానికి ఉన్నట్లు కనిపించడం లేదు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ తన బాధ్యతను విస్మరించి,నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం శోచనీయం.

స్థానిక ప్రభుత్వాలకు సకాలంలో ఎన్నికలు నిర్వహించకుండా ఉంటే కేంద్ర ప్రభుత్వం నుంచి స్థానిక ప్రభుత్వాలకు వచ్చే నిధులు నిలిచి పోతాయి. ఆ విధంగా అటు స్థానిక ప్రభుత్వాలు, ఇటు రాష్ట్రం ఆర్థికంగా నష్టపోతాయి. కాబట్టి వీలైనంత త్వరగా మున్సిపల్ కార్పొరేషన్ లకు,మున్సిపాలిటీలకు, నగర పంచాయతీలకు, గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని, జిల్లా పరిషత్తులకు, మండల పరిషత్తులకు సెప్టెంబర్ 24 లోపల ఎన్నికలు నిర్వహించాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# కార్మికుల సమస్యలు పట్టించుకోని మున్సిపల్ అధికారులు

- 8 నెలల జీతాల కోసం మున్సిపల్ కార్మికుల పోరాటం తీవ్రం
- 6వ రోజుకు చేరిన నాయుడుపేటలో నాన్ ఆప్కాస్ కార్మికుల నిరసన




నాయుడుపేట - సూర్య వాస్తవం : నాయుడుపేట మున్సిపాలిటీలో పనిచేస్తున్న నాన్ ఆప్కాస్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల ఆందోళన రోజు రోజుకు తీవ్రరూపం దాల్చుతోంది. ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసన కార్యక్రమం బుధవారం నాటికి ఆరవ రోజుకు చేరింది. అధికారుల నిర్లక్ష్య ధోరణిపై కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**పెండింగ్ వేతనాల కోసం మోకాళ్లపై నిరసన - కార్మికుల ఆవేదన**

మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు వినూత్నంగా నిరసన తెలిపారు. ప్రభుత్వానికి, అధికారులకు దండం పెడుతూ మోకాళ్లపై నిలబడి తమ బాధలను వ్యక్తం చేశారు. తమ కష్టాలను గుర్తించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని వేడుకున్నారు. ఈ దృశ్యాలు అక్కడ ఉన్న ప్రజలను కదిలించాయి. సిఐటియు నాయకులు శివకవి ముకుందా, ఎస్.కె. అబ్దుల్లా మాట్లాడుతూ నాన్ ఆప్కాస్ కార్మికులకు కనీస వేతనం రూ.15,000 ఇవ్వాలని, 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం 12 గంటలు పని చేయిస్తూ కేవలం రూ.12,000 మాత్రమే చెల్లించడం అన్యాయమని విమర్శించారు.

**అధికారులకు పలుమార్లు విన్నపం కనిపించని స్పందన**

ఇప్పటికీ పలుమార్లు మున్సిపల్ అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేసినా స్పందన లేకపోవడంతో ఆందోళన మార్గాన్ని ఎంచుకున్నామని కార్మికులు తెలిపారు. వాహనాలు సరిగా లేవని, భద్రతా పరికరాలు ఇవ్వడం లేదని, పని పరిస్థితులు దారుణంగా ఉన్నాయని ఆరోపించారు. కరోనా కాలం నుండి సేవలు అందిస్తున్న సీనియర్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చకుండా అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు లేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, జీవనోపాధి సంక్షోభంలో ఉన్నామని తెలిపారు.

**జీతాలు ఇవ్వకపోతే ఆందోళన ముదురుతుంది - కార్మికుల హెచ్చరిక**

కార్మికుల న్యాయమైన డిమాండ్లు వెంటనే నెరవేర్చకపోతే ఆందోళనను మరింత ఉధ్ధృతం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే పెద్ద స్థాయిలో ఉద్యమానికి సిద్ధమవుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అనిల్, రాజేష్, రమణయ్య, రమణమ్మ, సురేష్, అజయ్, వాసు, వెంకటసుబ్బయ్య, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# కలలు నిజం కావాలంటే నిరంతరం శ్రమించాలి

## - ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సదస్సు

పులివెందుల - సూర్య వాస్తవం : విద్యార్థినులు తమ కలలను నిజం చేసుకోవాలంటే విశ్రమించకుండా పట్టుదలతో శ్రమించాలని పలువురు ప్రముఖులు పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మై డ్రీమ్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు పాజిటివ్ థింకింగ్ మరియు వేదిక్ మాథ్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు విద్యార్థినులకు దిశానిర్దేశం చేశారు.వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ యు.శ్రీనిత మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థినిలకు సరైన మోటివేషన్, కెరీర్ గైడెన్స్ ఎంతో అవసరమని పేర్కొన్నారు. డాక్టర్ వి.భవ్య చరిత ప్రసంగిస్తూ ప్రతి విద్యార్థిని తనను తాను గౌరవించుకోవాలని, సానుకూల ఆలోచనా దృక్పథం (సానుకూల ఆలోచన) ఆత్మవిశ్వాసంతోనే భవిష్యత్తును ప్రకాశవంతం చేసుకోవచ్చని వివ రించారు. డి.చిన్నయ్య మాట్లాడుతూ, విజయం సాధించాలంటే సమయపాలన, దృఢ సంకల్పం, ఓపిక, నిజాయితీ, సరైన ప్రణాళిక కలిగి ఉండాలని సూచించారు. జె.బాలశివ వేదిక్ మాథ్స్ గురించి వివరిస్తూ, గణితంలోని మెళకువలను జీవితంలోని సమస్యలను పరిష్కరించు కోవడానికి ఎలా అన్వయించుకోవాలో విద్యార్థినిలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, పెద్ద సంఖ్యలో విద్యార్థినిలు పాల్గొన్నారు.

# ఉగాది, రంజాన్ పండుగలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

## - ఎస్ఐ నాగమధు




కనేకల్-సూర్య వాస్తవం : ప్రజలు ఉగాది, రంజాన్ పండుగలను భక్తిశ్రద్ధలతో, శాంతి సామరస్యాలతో జరుపు కోవాలని ఎస్సై నాగమధు సూచించారు. మార్చి నెలలో ప్రారంభమయ్యే నూతన తెలుగు సంవత్సరంలో అన్ని పండుగలు శుభప్రదంగా జరగాలని, అల్లాహ్ దీవెనలతో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఉగాది పండుగ సందర్భంగా తీపి, పులుపు, కారం, ఉప్పు, వగరు, చేదు రుచుల సమ్మేళనంగా ఉండే ఉగాది పచ్చడి జీవన సత్యాలను ప్రతిబింబిస్తుందని తెలిపారు. జీవితంలో ఎదురయ్యే సుఖ దుఃఖాలను సమానంగా స్వీకరించాలనే సందేశాన్ని ఈ పండుగ ఇస్తుందని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులందరూ కలిసి సంప్రదాయబద్ధంగా ఉగాది పండుగను ఆనందంగా జరుపుకోవాలని కోరారు.రంజాన్ మాసం క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల సమ్మేళనమని ఎస్సై నాగమధు అన్నారు. పవిత్ర ఖురాన్ అవతరించిన ఈ మాసంలో ముస్లింలు నెలరోజుల పాటు ఉపవాస దీక్ష పాటిస్తూ అల్లాహ్‌ను భక్తితో ఆరాధిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా బీద, ధనిక తేడా లేకుండా దానధర్మాలు చేయడం, సేవా భావాన్ని చాటుకోవడం రంజాన్ ప్రత్యేకత అని వివరించారు. పండుగల సమయంలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలందరూ సహకరించా లని, ప్రశాంత వాతావరణంలో వేడుకలను నిర్వహించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# విద్యకు పెద్దపీట వేసిన మంత్రి నారా లోకేష్

- ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా గవర్నమెంట్ పాఠశాలలు
- ప్రతి విద్యార్థికి విద్యను అందించడమే కూటమి లక్ష్యం
- మన విద్యా ప్రయాణం దేశానికే ఆదర్శం




**రాయదుర్గం – సూర్య వాస్తవం :** విద్యార్థులకు అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నాణ్యత, రుచి, శుచిలో దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో, విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు ఆధ్వర్యంలో రాష్ట్రంలో విద్యా ప్రయాణం ఓ మార్గదర్శకంగా కొనసాగుతుండటం అభినందనీయమ న్నారు. రాయదుర్గం పట్టణ శివారులోని 21వ వార్డు పైతోటలో భక్త కన్నప్ప మున్సిపల్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులతో మధ్యాహ్న భోజన పథకంపై బుధవారం విద్యార్థులతో ఆయన ముఖాముఖి సంభాషించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులతో నేలపై కూర్చొని సహపంక్తి భోజనం చేశారు. భోజనంలో ప్రతిరోజు అమల వుతున్న మెనూ గురించి విద్యార్థులను అడిగి తెలుసు కున్నారు. సన్న బియ్యంతో వండిన అన్నంతో పాటు రుచికరమైన పప్పు, సాంబారు, రసము కోడిగుడ్డు ఇస్తున్నట్లు విద్యార్థులు ఆయనకు వివరించారు. పిల్లలతో పాటు తాను కలిసి భోజనం చేశానని, ఎంతో రుచిగా, నాణ్యతగా ఉందని ఎమ్మెల్యే అభినందించారు. పాఠశాలకు వస్తున్న పిల్లల్లో చాలామంది నిరుపేద కుటుంబాలకు చెందిన వారేనని ఆయన తెలియజేశారు. ఇలాంటి కుటుంబాల నుంచి వస్తున్న పిల్లలకు బలవర్ధకమైన పౌష్టికాహారం అందించడం వల్ల చదువులో వారు శ్రద్ధగా రాణించగలుగుతారని అభిప్రాయపడ్డారు. వీరంతా సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చే దిశగా ప్రభుత్వం ఉత్తమ విద్యా విధానాన్ని కొనసాగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, పైతోట రామంజి, సీన, మధు, ఆంజనేయులు, సిద్దన్న తదితరులు పాల్గొన్నారు.



## నియోజకవర్గంలోని ప్రతి మండల కేంద్రంలో

# పార్క్, గ్రౌండ్ ఉండేలా ఏర్పాటు చేయాలి

- ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి బిజెపి కో-కన్వీనర్ కుందు శ్రీనివాస్ రెడ్డి వినతి





**శింగనమల– సూర్య వాస్తవం :** శింగనమల నియోజక వర్గం భారతీయ జనతా పార్టీ కోకన్వీనర్ కుందూ శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీకి వినతి పత్రం ఇచ్చి శింగనమల నియోజకవర్గంలోని ప్రతి మండల కేంద్రంలో ఒక పార్క్ ఒక గ్రౌండ్ ఉండేలా ఏర్పాటు చేయాలని వాటి వల్ల కలిగే ఉపయోగాలు గురించి వివరిస్తూ ప్రజలు ఉదయాన్నే లేదా సాయంత్రం వేళల్లో వాకింగ్ చేయడానికి, యోగా మరియు వ్యాయామం చేయడానికి అనువైన స్థలం లభిస్తుంది. దీనివల్ల డయాబెటిస్, బీపీ వంటి జీవనశైలి వ్యాధులు తగ్గే అవకాశం ఉంటుంది పచ్చదనం మధ్య కాసేపు గడపడం వల్ల మనసుకు ప్రశాంతత లభిస్తుంది. రోజువారీ జీవితంలోని ఒత్తిడి నుండి ఉపశమనం పొందే అవకాశం ఏర్పడుతుంది. పార్కులో ఊయలలు, జారుడు బండలు వంటివి ఉండడం వల్ల పిల్లలు ఆడుకోవడానికి సురక్షిత మైన స్థలం దొరుకుతుంది. ఇది వారి శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడుతుంది. పార్కు అనేది అన్ని వయసుల వారు, అన్ని వర్గాల ప్రజలు కలిసే కేంద్రంగా మారుతుంది. గ్రౌండ్ వల్ల ఉపయోగాలు వివరిస్తూ యువత క్రికెట్, వాలీబాల్, ఫుట్బాల్, వంటి క్రీడలు ఆడుకోవడానికి తగిన స్థలం లభిస్తుంది. దీంతో గ్రామీణ స్థాయిలోనే క్రీడా సామర్థ్యం గల యువతని వెలికి తీయడానికి అవకాశం ఏర్పడుతుంది.క్రమం తప్ప కుండా గ్రౌండ్లో ఆటలు ఆడటం వల్ల యువత శారీర కంగా దృఢంగా ఉంటారు. గ్రౌండ్ అనేది గ్రామసభలు, ప్రజా సమావేశాలు, ర్యాలీలు నిర్వహించ డానికి ఒక వేదికగా ఉపయోగ పగపడుతుంది.

జాతీయ పండుగలు స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం వంటి సందర్భాల్లో గ్రౌండ్లోనే జెండా వందనం కార్య క్రమాలు నిర్వహించుకోవడానికి, ఉపయోగపడుతుంది. మొత్తం మీద, ప్రతి మండల కేంద్రంలో ఒక పార్క్, గ్రౌండ్ ఉండటం వల్ల ఆ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు పెరగడమే కాకుండా, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, ఆరోగ్య రంగాల్లో కూడా సానుకూల ప్రభావం చూపుతుందని వివరించారు. ఈ కార్యక్రవంలో బిజెపి నాయకులు రామ్మోహన్, పి.రామాంజ నేయులు, భార్గవ్, రామిరెడ్డి నరసింహ రెడ్డి, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్వచ్ఛ రథాన్ని ప్రారంభించిన ఎంపీపీ వీరనారాయణరెడ్డి

- టీడీపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి




**బ్రహ్మంగారిమఠం– సూర్యవాస్తవం:** మండలంలోని గ్రామ పంచాయతీలోని స్వీపర్లకు ఆటోరిక్షాను అలాగే చెత్తను సేకరించు టకు ప్లాస్టిక్ బకెట్లను బుధవారం మండల ఎంపీపీ వీరనారాయణరెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు సుబ్బారెడ్డి, జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి, సీనియర్ నాయకులు ఎస్సార్ శ్రీనివాసులు రెడ్డి, పూజ శివయ్య యాదవ్, సొసైటీ అధ్యక్షుడు సాంబశివారెడ్డి, టిడిపి ఉప అధ్యక్షుడు నరసింహా గౌడ్ మండల ఎంపీడీవో వై.రామ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో జెండా ఊపి చెత్త సేకరించు రిక్షాలను అందించారు. అలాగే స్వచ్ఛ రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు.ఈ స్వచ్ఛ రథం మండలంలోని గ్రామాలలో తిరిగి, పనికి రాని ఇనుము, ప్లాస్టిక్, పాత పుస్తకాలు తదితర వస్తువు లను సేకరించి రథంలో ఉన్న మనకు కావలసిన వస్తువులను తీసుకొనవచ్చని ఎంపీడీవో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# మత సామరస్యం, ఆత్మీయతకు ప్రతీక ఇఫ్తార్ విందు

- టీడీపీ ఇన్‌ఛార్జి బిటెక్ రవి

**వేంపల్లె – సూర్య వాస్తవం:** మత సామరస్యం, ఆత్మీయతకు ప్రతిక ఇఫ్తార్ విందు అని టిడిపి పులివెందుల ఇంఛార్జీ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి(బిటెక్ రవి) అన్నారు. బుధవారం స్థానిక విశ్వనాథ్ రెడ్డి మిషన్ వద్ద టిడిపి నాయకుడు దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి(దిల్మాంగే) ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో టిడిపి ఇంఛార్జీ బిటెక్ రవి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్ధసారథిరెడ్డి, వేంపల్లె మండల ఇంచార్జీ రఘునాథ్ రెడ్డి, కన్వీనర్ రామమునిరెడ్డి, హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాషా, మైనార్టీ ఫైనాన్స్ సంస్థ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. రంజాన్ మాసం అత్యంత పవిత్రమైందని, కఠోర దీక్షలతో ఉంటూ దేవున్ని ప్రార్ధిస్తారన్నారు. ప్రతి ఒక్కరికీ ముందస్తు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బాలస్వామిరెడ్డి, జగన్నాథరెడ్డి, వీరభద్ర, వేమాకుమార్, యాసిన్, మహమ్మద్, డక్కారమేష్, ఫయాజ్, షరీఫ్, తాజు, ఫయాజ్, బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రంజాన్ తోఫా పంపిణీ

**తనకల్లు – సూర్య వాస్తవం:** శ్రీ సత్య సాయి జిల్లా తనకల్లు, కొక్కంటి గ్రామంలో లోని 210 కుటుంబాలకు స్విమ్స్ హాస్పిటల్ ఎండి నిసార్ యాసిన్ ఖాన్ రమదాన్ తోఫాను పంపిణీ చేశారు. పవిత్ర రమదాన్ మాసంలో పండుగను జరుపుకునే సందర్భంగా తనకు దేవుడు ఇచ్చిన దానిలో తన వంతుగా అవసరమున్న కుటుంబాలకు కొన్ని నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. మస్జిద్‌కు సంబంధించి కూడా చిరు సహాయం చేయడానికి ఎల్లవేళల అందుబాటులో ఉంటానని తెలియజేశారు. ఈ సందర్భంగా తనకల్లు, కొక్కంటి గ్రామాల మత పెద్దలు నిసార్ యాసీన్ కీ ఆత్మీయ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ తాహెర్ వలి, ఉపాధ్యాయులు ఇర్ఫాన్ బాషా, నజీర్, సుభాన్, రౌఫా, మస్తాన్, రసూల్, బాబ్జాన్, అక్బర్, బాబా ఫక్రుద్దీన్, మహబూబ్ బాషా, లాలూ సబ్, బాబా ఫక్రోద్దీన్, మౌలానా ఇబ్రాహీం సబ్, షఫీ, వసీం యాసీన్ ఖాన్,మత పెద్దలు సిమ్స్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీచైతన్యలో ముందస్తు రంజాన్, ఉగాది వేడుకలు

- సంస్కృతీ, నైతిక విలువలు అలవర్చుకోవాలి



**వేంపల్లె – సూర్య వాస్తవం:** స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో ముందస్తు రంజాన్, ఉగాది పండుగల వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం పాఠశాల ప్రాంగణంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షణగా నిలిచాయి. కరస్పాండెంట్ బండ్రెడ్డి చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ పరస్పర గౌరవం, ఐక్యత, సాంస్కృతిక విలువలను పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే పాఠశాల డైరెక్టర్లు చేతన్ రెడ్డి, చైతన్యరెడ్డిలు మాట్లాడుతూ విద్యతో పాటు సంస్కృతి, నైతిక విలువలను కూడా అలవర్చుకోవాలని కోరారు. అన్ని మతాలను గౌరవించడం, సాంస్కృతిక సమైక్యతను కాపాడుకోవడం ఎంతో అవసరమన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల మధ్య ఆనందోత్సాహంతో వేడుకలు కొనసాగాయి.

# గోరుకల్ రిజర్వాయర్ నుండి జలదుర్గం గ్రామానికి తాగునీరు





**ప్యాపిలి– సూర్య వాస్తవం :** స్థానిక మండల పరిధిలో జలదుర్గం గ్రామంలో వాటర్ గ్రిడ్ పథకం లో భాగంగా బుధవారం వాటర్ షెడ్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులు కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి, వై నాగేశ్వరావు యాదవ్ డిసి సీఎం ఛైర్మన్, రాష్ట్ర అధ్యక్షులు అలాగే పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు, గోరుకల్ రిజర్వాయర్ నుండి జలదుర్గం గ్రామానికి శుద్ధి చేయబడిన తాగునీరు అందించేందుకు నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంక్ ట్రయల్ రన్ మరియు పూజా కార్యక్రమంలో డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షితమైన, పరిశుభ్రమైన తాగునీరు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ వాటర్ గ్రిడ్ పథకం ద్వారా జలదుర్గం గ్రామ ప్రజలకు నిరంతరంగా నాణ్యమైన తాగునీరు అందుబాటులోకి రావడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. అలాగే ఈ ప్రాజెక్టు ద్వారా గ్రామంలో నీటి కొరత సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సంక్షేమ శ్రేయో రాజ్యమే కూటమి లక్ష్యం

**- ప్రతి పథకం చిత్తశుద్ధితో అమలు చేస్తుంది**
**- శ్రీ శక్తి పథకంతో మహిళలకు పెద్దపీట..**



**రాయదుర్గం - సూర్య వాస్తవం:** తెలుగుదేశం పార్టీ మూల సూత్రాల్లో సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వటం జరిగిందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. రాయదుర్గం పట్టణంలో దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించేందుకు నిర్దేశించిన "దివ్యాంగ శక్తి" పథకాన్ని బుధవారం ఆయన ప్రారం భించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సంక్షేమ శ్రేయో రాజ్యాన్ని స్థాపించాలని తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, దివంగత నందమూరి తారక రామారావు సంకల్పించారన్నారు. ఆయన సూచించిన అడుగుజాడల్లో కూటమి ప్రభుత్వం పయనిస్తూ, నేడు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలు, బాలికలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని గత ఏడాది కూటమి ప్రభుత్వం ప్రారంభించిందని గుర్తు చేశారు. అదేవిధంగా దివ్యాంగులకు కూడా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పించా లన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దివ్యాంగశక్తి పేరుతో ఈ పథకాన్ని ప్రారంభించడం జరుగుతోందన్నారు. సమాజంలో శారీరక ఇబ్బందులతో సతమతమవుతున్న దివ్యాంగ సోదర, సోదరీమణుల పట్ల మన ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఈ పథకం నిదర్శనమన్నారు. ?దివ్యాంగులు ఎవరిపైనా ఆధారపడకుండా, తమ పనుల నిమిత్తం రాష్ట్రమంతా స్వేచ్ఛగా తిరిగేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం గొప్ప నిర్ణయమన్నారు. 40శాతం పైగా శారీరక లోపం కలిగిన దివ్యాంగులకు ఇది వర్తిస్తుందన్నారు. వారికి తోడుగా వెళ్లే సహాయకుడికి కూడా టికెట్ ధరలో 50% రాయితీ ఇవ్వడం ఈ పథకంలోని మానవీయ కోణాన్ని చూపిస్తోందన్నారు.



?గతంలో దివ్యాంగుల పింఛన్ రూ.3వేల నుండి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.6వేలకు పెంచారన్నారు. ఈ 'దివ్యాంగ శక్తి' పథకం ఒక గొప్ప వరమని భావిస్తూ, ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. సమాజంలో దివ్యాంగులను భాగస్వాములను చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి దివ్యాంగ సోదర, సోదరీమణులందరూ ఈ పథకాన్ని సద్వినియోగపర్చుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. లబ్ధిదారులతో కలిసి బస్సులో ప్రయాణించిన ఎమ్మెల్యే అనంతరం బళ్లారి రోడ్డులోని సీతారామాంజనేయ కళ్యాణమంటపంలో సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, బిజెపి నాయకులు అంబోజి రావ్, వసుంధర దేవి, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ కరేగౌడ మంజునాథ, మాజీ డైరెక్టర్ టశీకశాల హనుమంతు, కరెన్న,అగ్రహారం కిరణ్, గుద్దిటి లోకేష్, ఆనంద్, బుదురు తిప్పేస్వమి,వై.వెంకటేశులు,ఆటో వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

# కోట ఉత్సవాలు విజయవంతం

**- మున్సిపల్ అధికారులను, సిబ్బందిని, వర్కర్లను ప్రశంసించిన జిల్లా కాలెక్టర్**





**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక శాఖ ద్వారా అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గుత్తి కోట ఉత్సవాలలో భాగంగా భారత దేశం గర్వించదగ్గ పర్యాటక కేంద్రాలలో ఒకటిగా ప్రఖ్యాతి గావింపబడు చున్న గుత్తి కోట ఉత్సవాలు దేశ న లుమూలలా ఘనమైన స్థానాన్ని పొందేలా నిర్వహణలో మున్సిపాలి టీ సేవలను అందించినందుకు గాను మున్సిపల్ కమీషనర్ బి.జబ్బార్ మియాని, మేనేజర్ రాంబాబుని,డి. ఈ.ఈ హేమచంద్ర కుమార్ ని,శాని టరీ ఇన్స్ పెక్టర్ మహబూబ్ భాష ని అభినందన ప్రశంశలతో సన్మానించి న జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్. ఈ సందర్భంగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ గుత్తి కోట ఉత్సవాలు విజయవంతం కా వడములో ముఖ్య భూమిక పోషిం చిన మున్సిపల్ అధికారులను,సి బ్బందిని, వర్కర్లను ప్రశంశించారు.

## 10వ తరగతి పరీక్షా కేంద్రాలలో తహశీల్దార్ తనిఖీలు



**కణేకల్లు - సూర్య వాస్తవం :** గ్రామంలో నిర్వహిస్తున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షల సందర్భంగా స్థానిక తహశీల్దార్ బ్రహ్మయ్య బుధవారం పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షా నిర్వహణ విధానం, కేంద్రాలలో ఏర్పాటు చేసిన మౌలిక వసతులు, భద్రతా చర్యలను ఆయన సమగ్రంగా పరిశీలించారు.పరీక్షా హాళ్లలో విద్యార్థులు ప్రశాంత వాతా వరణంలో పరీక్షలు రాస్తున్నారా అనే విషయాన్ని పరిశీలించడంతో పాటు, ప్రశ్నాపత్రాల పంపిణీ, సమాధాన పత్రాల సేకరణ విధానాలను కూడా పరిశీలించారు. అదేవిధంగా, ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసు కోవాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు తాగునీరు, కూర్చోవడానికి సరైన సదుపాయాలు, విద్యుత్ సరఫరా వంటి ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నా యా అనే విషయాన్ని కూడా ఆయన తెలుసుకున్నారు. ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని సిబ్బందిని ఆదేశించారు.పరీక్షలు నిష్పక్షపాతంగా, పారద ర్శకంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా, ధైర్యంగా పరీక్షలు రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంట గ్రామ రెవెన్యూ అధికారి పవన్ కుమర్ పాల్గొ న్నారు. తనిఖీలతో పరీక్షా కేంద్రాల్లో నిర్వహణపై మరింత క్రమశిక్షణ నెలకొంది.



## వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

**- పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి**

**పులివెందుల - సూర్య వాస్తవం :** ప్రస్తుతం వేసవి కాలం ప్రారంభమైన దృష్ట్యా, పులి వెందుల మండలం, దాని చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు రాబోయే మూడు నెలల పాటు ఎలాంటి తాగునీటి ఎద్దడిని ఎదుర్కోకుండా తగిన ముందస్తు చర్యలు చేపట్టాలని పులివెందుల ఎంపీడీవో కార్యాలయంలో సంబంధిత అధికారులను తెలిపారు . ఈ సందర్భంగా జడ్పిటిసి మారెడ్డి లతారెడ్డి మాట్లాడుతూ ఎక్కడా కూడా నీటి కొరత తలెత్తకుండా తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలి. ?అలాగే, పారిశుధ్య నిర్వహణపై కూడా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా, మురుగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలి. పారిశుధ్య లోపం వల్ల ప్రజలు ఎలాంటి రోగాల బారిన పడకుండా వారి ఆరోగ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. ఒక సాధారణ గృహిణిగా నీటి సమస్య వల్ల ఇంటి దగ్గర ఎదురయ్యే ఇబ్బందుల పట్ల నాకు పూర్తిస్థాయిలో అవగాహన ఉంది. ప్రస్తుతం ఒక ప్రజాప్రతినిధి హోదాలో ప్రజల పక్షాన నిలబడి ఈ ప్రధాన సమస్యలను మీ దృష్టికి తీసుకువస్తున్నాను. దయచేసి అధికారులు ఈ విష యాలపై తక్షణమే స్పందించి తగిన పరిష్కారాలు చూపాలని కోరుకుంటున్నానని, ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అమరావతిలో ఉదయించే 'ఉగాది సూర్యుడు' ఊహాచిత్రం



**రాయచోటి-సూర్యవాస్తవం :** ఉగాది పండుగ సందర్భంగా జాతీయ స్థాయి గుర్తింపు పొందినప్రముఖచిత్రాకారుడు, నటుడు, రచయిత, రంగస్థల దర్శకుడు ఎస్.జైనుల్లా ఆబెద్దీన్ భాష అలియాస్ అభినయ్ కుంచె నుంచి జాలువారిన అమరావతిలో ఉదయించే 'ఉగాది సూర్యుడు' నామకరణంతో ఊహ చిత్రాన్ని చిత్రీకరించి బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా 'అభినయ్' మాట్లాడుతూ అమరావతి రైతుల కల ఒక ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణంతో రైతుల భూములకు, భవిష్యత్తుకు సామాజిక-ఆర్థిక భద్రత పొందడం. 34 వేల ఎకరాలకు పైగా భూములను ల్యాండ్పూలింగ్‌లోఇచ్చి,సుస్థిరమైన, అభివృద్ధి చెందిన నగరం అమరావతి రైతుల కోరిక అన్నారు. ఐదేళ్ల నిరీక్షణ తర్వాత, ఇప్పుడుఅమరావతి పనులు వేగవంతం కావడంతో, కల సాకార మవుతుందనే నమ్మకంతో, సంతోషంతో ఉన్న అమరావతి రైతుల ఆనందం కోసమే ఈ పెయింటింగ్ చిత్రీకరించడం జరిగిందని ఆయన చెప్పారు. ఉగాది పండగ సందర్భానుసారంగా చిత్రీకరించిన ఈ పెయింటింగ్‌లో రాష్ట్రీయ పక్షిరామచిలుక, జంతువు కృష్ణ జింక, వృక్షం వేప చెట్టు, పుష్పం మల్లె పువ్వు,పండుమామిడికాయలు, కోకిల పాటపాడినట్టుంది. చిత్రం చూడగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గుర్తొచ్చే విధంగా చిత్రకారుడు చిత్రీకరించాడు. అమరావతి లో ఉదయించే 'ఉగాది సూర్యుడు' చిత్రాన్ని చిత్రీకరించి రాష్ట్ర రాజధానిపై' రైతులపై తన కున్న అభిమా నాన్ని చాటుకున్నాడు కళా కారుడు అభినయ్. రంగురంగుల ఈ పెయింటింగ్ అందరిని ఎంతగానో ఆకట్టుకుంటుంది.

## ఆంజనేయ స్వామి దేవస్థానంలో గ్రామోత్సవం

**- కార్యనిర్వహణాధికారి కే.సుభాష్**



**వేంపల్లె -సూర్యవాస్తవం :** గురువారం ఉగాది పండుగను పురస్కరించుకుని వేంపల్లె మెయిన్ బజారులో వెలసియున్న శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో సాయంత్రం 4 గంటలకు ఉగాది ఆస్థానం కలదని కార్యనిర్వహణాధికారి కే సుభాష్ తెలిపారు. సాయంత్రం 4 గంటల నుండివిశేష ఆరాధన అనంతరం 6 గంటల వరకు పంచాంగ శ్రవణం చదవబడును. అనంతరం 6 గంటలనుండి స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించిబడును. కావున భక్తులందరూ పై కార్యక్రమం లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

**భక్తులకు ముఖ్యగమనిక :** ఉగాది పండగ రోజు సాయంత్రం జరుగు స్వామి వారి గ్రామోత్సవం రోడ్ మరమత్తుల కారణంగా అడ్డ రోడ్ నుండి బస్టాండ్ వరకు ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా స్వామి వారి ఉత్సవాన్ని ఆ ప్రాంతము నందు మాత్రమే రద్దుపరిచి, యధావిధిగా గ్రామోత్సవం ఆంజనేయ స్వామి దేవస్థానం నుండి ప్రారంభించి బిడలుమిట్ట, పాత స్టేట్ బ్యాంకు, అమ్మవారిశాల కాపువీది,పాత పేట మీదుగా తిరిగి ఆల యానికి చేరును.కావున భక్తులు దయవుంచి ఈ మార్పును గమనించ వలసినదిగా తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

## పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాల పంపిణీ



**డోన్- సూర్య వాస్తవం:** పవిత్రమైన రంజాన్ పండుగ సందర్భంగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులు, పండుగకు అవసరమైన సామగ్రిని పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమం బుధవారం డోన్ పట్టణంలోని శ్రీరామనగర్, వైఎస్సార్ నగర్ కాలనీల్లో నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఐద్వా నాయకురాలు షేమిమ్ బేగం మాట్లాడుతూ, ముస్లింలు ఎంతో భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు పాటిస్తూ జరుపుకునే రంజాన్ పండుగ పవిత్రతను వివరించారు. ఆమె మాట్లాడుతూ, మహిళలు, బాలికలపై జరుగుతున్న అన్యాయాలు, దాడులు, అఘాయి త్యాలకు వ్యతిరేకంగా ఐద్వా నిరంతరం పోరాటం చేస్తున్నదని చెప్పారు. సమాజంలో మద్యం, మట్కా, గంజాయి వంటి మాదకద్రవ్యాల వ్యసనాల వల్ల మహిళల జీవితాలు చీకటిలోకి వెళ్లిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అశ్లీలతకు వ్యతిరేకంగా కూడా సంఘం పోరాటం కొనసాగిస్తోందని తెలిపారు. రంజాన్ పండుగ ప్రతి ఒక్కరి ఇంట్లో ఆనందంగా జరగాలని ఆకాంక్షిస్తూ, పేద ముస్లిం కుటుంబాలకు సహాయం అందించడం ద్వారా వారి ఇళ్లలో పండుగ వాతావరణం నెలకొల్పడం ఐద్వా లక్ష్యమని పేర్కొన్నారు. రంజాన్ కేవలం ఆచారం మాత్రమే కాకుండా సేవా భావానికి ప్రతీక అని, పేదలతో పండుగ ఆనందాన్ని పంచుకోవడం సంఘం ముఖ్య లక్ష్యమని తెలిపారు. సమాజంలో ఐక్యత, పరస్పర సహకారం పెంపొందించడంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు కీలకమని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు మాధవి, బీబీ, సూర్య పద్మావతి, సిరిన, ఇర్ఫాన, సులోచనలతో పాటు పలువురు ముస్లిం మహిళలు పాల్గొన్నారు.

## ‘పెద్ది’ సెట్స్‌లో తిలక్ వర్మ..

# స్పెషల్ ‘బ్యాట్’ చూశారా?

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా పెద్దిపై అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో రూపొందుతున్న ఆ చిత్రంలో బాలీవుడ్ హీరోయిన్ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఉప్పెన ఫేమ్ దర్శకుడు బుచ్చిబాబు సనా సినిమాను ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన చికిరి చికిరి, రైరై రారా వంటి పాటలు ప్రేక్షకులను ఆకట్టుకుని సినిమాపై మంచి హైప్ సృష్టించాయి. ప్రస్తుతం పెద్ది మూవీ షూటింగ్ చివరి దశకు చేరుకుంది. భారీ బడ్జెట్ తో రూపొందుతున్న ఆ సినిమాను వృద్ధి సినిమాస్ బ్యానర్ పై సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. నిర్మాణ భాగస్వాములుగా మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ కూడా ఉన్నాయి. క్రీడా నేపథ్యంలో సాగే ఆ కథలో గ్రామీణ వాతావరణం, భావోద్వేగాలు, యాక్షన్ అంశాలు ముఖ్యంగా ఉండనున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే, తాజాగా పెద్ది సెట్స్ లో టీమిండియా యువ క్రికెటర్, తెలుగు కుర్రాడు తిలక్ వర్మ సందడి చేశారు. ఇటీవల టీ20 వరల్డ్ కప్‌లో అద్భుత ప్రదర్శనతో గుర్తింపు పొందిన తిలక్ వర్మ, పెద్ది షూటింగ్ జరుగుతున్న ప్రదేశాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సినిమా స్పోర్ట్స్ సీన్స్‌ను చూసి, చిత్ర యూనిట్ పనితీరుకు ప్రశంసలు కురిపించారు. సెట్స్ లో హీరో రామ్ చరణ్‌తో తిలక్ వర్మ ఫ్రెండ్లీగా ముచ్చటించడం అభిమానులను ఆకట్టుకుంది. ఆ సందర్భంగా



రామ్ చరణ్, తిలక్ వర్మకు ప్రత్యేకంగా ఒక బ్యాట్ ను గిఫ్ట్ గా అందించారు. పెద్ది సినిమా షూటింగ్ లో ఉపయోగించిన పాత బ్యాట్ ను గుర్తుగా ఇచ్చి, దానిపై తన ఆటోగ్రాఫ్ కూడా చేశారు. ఆ గిఫ్ట్ తిలక్ వర్మకు మరింత ఆనందాన్ని కలిగించినట్లు కనిపిస్తోంది. అంతేకాకుండా, వరల్డ్ కప్ లో తిలక్ వర్మ ప్రదర్శనపై రామ్ చరణ్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అతని టాలెంట్ ను మెచ్చుకుంటూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. మరోవైపు తిలక్ వర్మ కూడా పెద్ది సినిమా భారీ విజయాన్ని సాధించాలని కోరుకున్నారు. రామ్ చరణ్ పై తన అభిమానాన్ని వ్యక్తపరుస్తూ ఇద్దరూ హగ్ చేసుకోవడం విశేషం. అభిమానులకు తిలక్ వర్మ ఆటోగ్రాఫ్ ఇచ్చారు అయితే తిలక్ విజిట్ కు సంబంధించిన వీడియోను పెద్ది చిత్ర బృందం సోషల్ మీడియాలో పంచుకుంది. “టీ20 వరల్డ్ కప్ ఛాంపియన్ తిలక్ వర్మ పెద్ది సెట్స్ ను సందర్శించారు. సినిమా స్పోర్ట్స్ సీక్వెన్స్ ను చూసి ఫిదా అయ్యారు” అని మేకర్స్ ట్వీట్ చేశారు. పెద్ది చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 30న విడుదలకు సిద్ధమవుతోంది. ఇప్పటికే పాటలు, ప్రమోషన్స్ తో ఆసక్తి పెంచిన ఆ సినిమా విడుదల తర్వాత ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.

## టాలీవుడ్ ట్రెండ్ మారింది..

# బాలీవుడ్‌కు లాస్ట్ మినిట్

తెలుగు సినీ పరిశ్రమలో పెద్ద హీరోల సినిమాలు రిలీజ్‌కు దగ్గరపడే టైమ్ కు అనుకోని అడ్డంకులు ఎదుర్కోవడం ఒక సాధారణ పరిణామంగా మారింది. ముఖ్యంగా చివరి నిమిషంలో వీఎఫ్ఎక్స్ వర్క్స్, సెన్సార్ ఆలస్యం, లేదా ఫైనల్ కట్‌కు సంబంధించిన సమస్యలు తలెత్తడం వల్ల రిలీజ్ డేట్స్ లో మార్పులు చోటుచేసుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇక బాలీవుడ్ విషయానికి వస్తే, అక్కడి



నిర్మాణ వ్యవస్థ సాధారణంగా ముందుగానే పూర్తి ప్రణాళికతో సాగుతూ, రిలీజ్ కు కనీసం ఒక నెల ముందు ఫైనల్ కంటెంట్ సిద్ధంగా ఉండేలా చూసుకుంటారు. ఈ విధానం వల్ల అక్కడి సినిమాలు రిలీజ్ సమయంలో పెద్దగా ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉంటాయి. ఈసారి టాలీవుడ్ ముందంజలో నిలవగా, బాలీవుడ్ వెనుకబడిన దృశ్యం కనిపిస్తోంది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న భారీ కమర్షియల్ ఎంటర్‌టైనర్ ఉస్తాద్ భగత్‌సింగ్ ఈ మార్పుకు ప్రధాన ఉదాహరణగా నిలుస్తోంది. ఈ సినిమా రిలీజ్ కు చాలా ముందుగానే తన కంటెంట్ డెలివరీని పూర్తి చేసుకున్నట్లు సమాచారం. అంటే, ఫైనల్ కట్, సెన్సార్ ప్రాసెస్, టెక్నికల్ వర్క్స్ అన్నీ ముందుగానే పూర్తి చేసి, ప్లాన్ చేసిన షెడ్యూల్ ప్రకారం రిలీజ్ కు సిద్ధంగా ఉంచినట్లు తెలుస్తోంది. డైరెక్టర్ హరీష్ శంకర్ చేసిన ఈ ప్లానింగ్ ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా పెద్ద సినిమాలకు ఉండే లాస్ట్ మినిట్ టెన్షన్ లేకుండా, సమయానికి ముందే అన్ని పనులు పూర్తి చేయడం ద్వారా నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, థియేటర్ యజమానులకు కూడా స్పష్టత కలిగే పరిస్థితి ఏర్పడింది. ఇది కేవలం ఒక సినిమా విషయంలోనే కాదు, ఫ్యూచర్ లో తెలుగు సినిమా నిర్మాణ విధానంలో మార్పుకు నాంది కావచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇదే సమయంలో బాలీవుడ్‌లో మాత్రం విరుద్ధ పరిస్థితి కనిపిస్తోంది. ప్రముఖ చిత్రం దురంధర్2 కంటెంట్ డెలివరీ విషయంలో సమస్యలను ఎదుర్కొంటున్నట్లు వార్తలొస్తున్నాయి. రిలీజ్ డేట్ సమీపిస్తున్నప్పటికీ, ఫైనల్ కట్ ఇంకా రెడీగా లేకపోవడం, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ ఆలస్యంగా సాగుతున్నాయనే సమాచారం ఇండస్ట్రీలో చర్చకు దారితీసిందిఒకప్పుడు టాలీవుడ్‌పై ఉండే లాస్ట్ మినిట్ హడావిడి ముద్ర ఇప్పుడు తగ్గుముఖం పడుతుండగా, బాలీవుడ్ కూడా కొన్ని సందర్భాల్లో అదే సమస్యలను ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తోంది. మొత్తానికి, ఉస్తాద్ భగత్ సింగ్ సమయానికి ముందే పూర్తి కావడం ఒక సానుకూల సంకేతంగా నిలిస్తే, ధురంధర్2 ఎదుర్కొంటున్న ఇబ్బందులు బాలీవుడ్‌కు ఒక హెచ్చరికగా భావించవచ్చు. ఈ పరిణామాలు భవిష్యత్తులో ఇండియన్ సినీ ఇండస్ట్రీలో ప్రణాళికా బద్ధతకు ఎంత ప్రాధాన్యత ఉందో మరోసారి గుర్తు చేస్తున్నాయి.





## బెంగళూరుకు బొనాంజా..

# స్టేడియంలోనే మ్యాచ్‌లు!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ఫ్రాంచైజీలకు ఉండే అతిపెద్ద బెనిఫిట్.. తమ తమ సొంత మైదానాల్లో మ్యాచ్ లు ఆడడం. అలవాటైన మైదానంలో, స్థానిక అభిమానుల మధ్య మ్యాచ్ ఆడడం అంటే ఎంతైనా సానుకూలమే. అయితే, డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)కు ఈ విషయంలో మొన్నటివరకు ఒకటే బెంగ. నిరుడు టైటిల్ కొట్టాక జరిగిన విజయోత్సవంలో తొక్కిసలాట చోటుచేసుకుని 11 మంది చనిపోవడం పెద్ద దుమారమే రేపింది. ఈ నేపథ్యంలో చిన్నస్వామి స్టేడియంలో ఈ ఏడాది ఐపీఎల్ మ్యాచ్ ల నిర్వహణ ఉండదనే వరకు వెళ్లింది. అదే జరిగితే డిఫెండింగ్ చాంపియన్ ఆర్సీబీకి షాక్ అయ్యేది. కానీ, పరిస్థితి సద్దుమణిగింది. కర్ణాటక ప్రభుత్వం నుంచి అనుమతి రావడంతో చిన్నస్వామి స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్ ల నిర్వహణకు అడ్డు తొలగింది.చిన్నస్వామి స్టేడియంతో బెంగళూరు జట్టుకు సహజంగానే అనుబంధం ఉంది. లీగ్ లో అత్యంత ఆదరణ ఉన్న జట్లలో బెంగళూరు ఒకటి. ఈ కోణంలో చూసినా ఆర్సీబీ మ్యాచ్ లు చిన్నస్వామి స్టేడియంలో జరగకుంటే అది పెద్ద సంచలనమే అయ్యేది. ఈ నెల 28 నుంచి ఐపీఎల్ మొదలవనుండగా, చిన్నస్వామిలో మ్యాచ్ ల ఆతిథ్యానికి కర్ణాటక ప్రభుత్వం అనుమతిచ్చింది. భద్రతా ఏర్పాట్లపై నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికతో చర్చించి నిర్ణయం వెల్లడించింది. చిన్నస్వామిలో ఆర్సీబీ ఐదు మ్యాచ్ లు ఆడనుంది. ఈ ఫ్రాంచైజీకి రెండో హోం గ్రౌండ్ అయిన రాయ్ పూర్ స్టేడియంలో మరో రెండు మ్యాచ్ లు ఆడుతుంది. ప్లే ఆఫ్, ఫైనల్ కూడా చిన్నస్వామి స్టేడియానికి మరో గుడ్ న్యూస్ ఏమంటే.. ఐపీఎల్ ప్లేఆఫ్ మ్యాచ్ లలో ఒకటి, ఫైనల్ కూడా ఇక్కడే నిర్వహించనున్నట్లు కథనాలు వస్తుండడం. వాస్తవానికి, లీగ్ లో మంచి రసవత్తరమైన మ్యాచ్ లు జరిగే వేదికల్లో చిన్నస్వామి ఒకటి. అలాంటి స్టేడియంపై ఆంక్షలు విధిస్తే అది లీగ్ ఆకర్షణపై ప్రభావం చూపేది. అదేమీ జరగకుండానే సుఖాంతం అయింది. కానీ, 35 వేల మందికి మించకుండా ప్రేక్షకులను మాత్రమే అనుమతించనున్నారు. మ్యాచ్ కు 4 గంటల ముందే స్టేడియం గేట్లను తెరిచేందుకు నిర్ణయించాయిరు. మహిళలు, పిల్లలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయనున్నారు.



## సన్‌రైజర్స్ కెప్టెన్‌గా ఇషాన్ కిషన్

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ కీలక ప్రకటన చేసింది. రెగ్యులర్ కెప్టెన్, ఆస్ట్రేలియా దిగ్గజం పాట్ కమిన్స్ గాయం నుంచి ఇంకా కోలుకోకపోవడంతో తొలి కొన్ని మ్యాచ్‌లకు వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ జట్టుకు



నాయకత్వం వహిస్తాడని ఫ్రాంచైజీ ప్రకటించింది. అభిషేక్ శర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. 2025 నుంచి సన్‌రైజర్స్ జట్టులో ఉన్న ఇషాన్ కిషన్, ఇటీవల దేశవాళీ సీజన్‌లో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ గెలిచిన జార్ఖండ్ జట్టుకు విజయవంతంగా నాయకత్వం వహించాడు. అయితే, ఐపీఎల్‌లో కెప్టెన్‌గా అతనికి ఇదే తొలిసారి కావడం విశేషం.

# బాలల సంక్షేమమే లక్ష్యంగా సేవలందించండి

- అనంతపురం జిల్లా కలెక్టర్ ఆనంద్
- చిల్డ్రన్ హోం సూపరింటెండెంట్ రఫీ మున్నీసాకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేసిన కలెక్టర్ ఆనంద్



అనంతపురం బుడ్డప్ప నగర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలసదనం సూపరింటెండెంట్ ఖాజీ రఫీమున్నీసాకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్ ఓ.ఆనంద్. చిత్రంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీసీపీఓ మంజునాథ్, ఇతర అధికారులు

**అనంతపురం– సూర్య వాస్తవం:** బాలల సంక్షేమమే లక్ష్యంగా బాలసదనాల నిర్వాహకులు సేవలందించాలని అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అన్నారు. జిల్లాలోని మూడు ప్రభుత్వ హోమ్ లు, ఎనిమిది స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలసదనాల నిర్వాహకులకు కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ఆనంద్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను బుధవారం అందజేశారు. ఐసీడీఎస్ పీడీ ఎం.శ్రీదేవి, ఐసీపీఎస్ డీసీపీఓ మంజునాథ్ తో కలసి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుడ్డప్ప నగర్ లో విజయవంతంగా నిర్వ హిస్తున్న బాలసదనం(చిల్డ్రన్ హోం) సూపరింటెండెంట్ ఖాజీ రఫీమున్నీసాకు కలెక్టర్ రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ.. బాలల న్యాయ చట్టం 2015 ప్రకారం ప్రతి బాలసదనంలో కనీస ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు.

పిల్లలకు సంబంధించిన ఏ విధమైన సమాచారం అయినా ఐసీడీఎస్ పీడీ, డీసీపీఓకు తక్షణం తెలపాలని సూచించారు. బాలసదనంలోని పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు, ఆటంకాలు తలెత్తకుండా చూడటం నిర్వాహకుల ప్రధాన బాధ్యతగా కలెక్టర్ స్పష్టం చేశారు. రీజనల్ ఇన్ స్పెక్టర్ ఆఫ్ ప్రొఫెషన్ వెంకట ప్రసాద్, బాలల సంక్షేమ శాఖ డీపీఓ ఖలీల్ బాషా, ఇతర అధికారులు పాల్గొన్నారు.




## రంజాన్ పండుగ పరస్పర స్నేహభావం, సహనానికి ప్రతీక

- జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

**శ్రీ సత్యసాయిబ్యూరో – సూర్య వాస్తవం :** శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణంలోని ఔలియా అల్లాహ్ మర్కజ్ మసీదులో కదిరి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఇఫ్తార్ విందు అత్యంత భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఇఫ్తార్ విందు కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముస్లింలు నమాజ్ చేసి ఉపవాస దీక్షలు విరమించగా, వారితో పాటు జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్, డీఎస్పీ శివ నారాయణ స్వామి, కలిసి ప్రార్థనలో పాల్గొని ప్రార్థనలు చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ స్వయంగా ముస్లింలకు వడ్డించి ఇఫ్తార్ విందులో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మతసామరస్యానికి ప్రతిగా ఈ రంజాన్ పండుగ నిలుస్తుందని, ఈ పండుగను అందరూ సోదర, సోదరీ భావంతో సంతోషంగా జరుపు కోవాలన్నారు. రంజాన్ పండుగ క్రమశిక్షణకు, దాతృత్వానికి నిలువుటద్దమని పేర్కొన్నారు. అనంతరం ముస్లింలు జిల్లా ఎస్పీని శాలువాతో సన్మానించారు. ఈ కార్య క్రమంలో జిల్లా ఎస్పీతో పాటు, డీఎస్పీ శివ నారాయణ స్వామి సిఐలు డివి నారాయణ రెడ్డి, నిరంజన్ రెడ్డి, నాగేంద్ర ఎస్ఐలు, పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# మదనపల్లి మున్సిపాలిటీకి ప్రత్యేక అధికారిగా ఇన్‌ఛార్జి జిల్లా జేసీ మధుసూదన్ రావు





**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం :** మదనపల్లి మున్సిపల్ కౌన్సిల్‌కు సంబంధించిన ఐదేళ్ల పదవీకాలం 2021 మార్చి 18 నుండి 2026 మార్చి 17 సాయంకాలం వరకు కొనసాగి, నిర్ణీత గడువు నాటికి పూర్తయింది. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ సంస్థలలో ఎన్నికైన ప్రజాప్రతినిధుల పదవీ కాలం ముగిసిన దృష్ట్యా, పరిపాలనలో ఎటువంటి అంతరాయం కలగకుండా ఉండేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపాలిటీలలో పరిపాలన బాధ్యతలను తాత్కాలికంగా ప్రత్యేక అధికారుల ద్వారా నిర్వహించనున్నది. ఈ క్రమంలో మదనపల్లి మున్సిపాలిటీకి ప్రత్యేక అధికారిగా ఇంచార్జ్ జిల్లా జాయింట్ కలెక్టర్ మధుసూదన్ రావు నియమితులయ్యారు. బుధవారం ఉదయం మదనపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో ఇన్చార్జి జిల్లా జాయింట్ కలెక్టర్ మధుసూదన్ రావ్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి జిల్లా జాయింట్ కలెక్టర్, మదనపల్లి మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు అందుతున్న సేవలను మరింత మెరుగుపరచడానికి కట్టుబడి ఉన్నామని తాగునీటి సరఫరా, పారిశుధ్యం, కాలువల శుభ్రత, చెత్త నిర్వహణ, వీధి దీపాల నిర్వహణ వంటి మౌలిక సేవలలో ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామని, అలాగే నగర అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ పనులను వేగవంతం చేసి, ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అలాగే, ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనులు మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ వేగవంతంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు తమ సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేయాలని, వాటిని నిర్ణీత గడువులోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మున్సిపల్ పరిపాలన పారదర్శకంగా, సమర్థ వంతంగా కొనసాగుతుందని వెల్లడించారు.

ఈ సందర్భంగా మదనపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో ఇన్చార్జి జిల్లా జాయింట్ కలెక్టర్ మధుసూదన్ రావ్‌కు మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్ భాష, మదనపల్లి మున్సిపల్ కమిషనర్ ప్రమీల అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాఖ సిబ్బంది, అధికారులు, అనధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ పేరుతో వేధించిన యువకుడి హత్య కేసును ఛేదించిన పోలీసులు

- నిందితుల అరెస్టు



**శాంతిపురం – సూర్య వాస్తవం:** చిత్తూరు జిల్లా, శాంతీపురం మండల పరిధిలోని ముల్లూరు క్రిష్ణాపురం గ్రామ సమీపంలో జరిగిన యువకుడి హత్య కేసును రాళ్ళబూదుగూరు పోలీసులు బుధవారం ఛేదించారు.కుప్పం రూరల్ సిఐ జె మల్లేష్ యాదవ్ కథనం మేరకు ముల్లూరు కృష్ణాపురం గ్రామానికి చెందిన నవాజ్ (19) అనుమానాస్పద మృతికి సంబంధించి నమోదు చేసిన (క్రైమ్ నం 35/2026, యు/ఎస్ 103(1) ఆర్/డబ్ల్యూ 3(5) బిఎన్ఎస్) కేసులో నిందితులైన ఖాదర్ బాషా (50) మరియు షాహిన్ తాజ్ (42)లను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి కుప్పం ఎస్ డి పి ఓబి.పార్థసారధి పర్యవేక్షణలో కుప్పం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె.మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో, రాళ్ళబూదుగూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ నరేష్, పోలీసు సిబ్బందితో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు.ఇందులో భాగంగా శాంతీపురం మండలం ముల్లూరు కృష్ణాపురం క్రాస్ వద్ద నవాజ్ ను హత్య చేసిన నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.ఈ కేసు దర్యాప్తులో భాగంగా, మృతుడు నవాజ్ నిందితుల కుమార్తెను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడనే కారణంతో కోపానికి గురైన నిందితులు, ముందస్తు ప్రణాళికతో ఇటుక రాయితో దాడి చేసి హత్య చేసి దానిని ఆత్మ హత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేసినట్లు కుప్పం ఎస్డీపీఓ బి పార్థసారథి తెలిపారు.ఈ సంఘటన అనంతరం నిందితులు పరారీలో ఉన్నారని అయినా పోలీసులు చురుకైన గాలింపు చర్యలు చేపట్టి వారిని పట్టుకున్నట్లు రాళ్ళబూదుగూరు పోలీసులు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కుప్పం అదనపు మొదటి తరగతి న్యాయ స్థానంలో హాజరుపరిచారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు.

## వాహనదారులు ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలి

- సీఐ టి.నరసింహులు

**వేంపల్లె – సూర్య వాస్తవం :** వాహనదారులు ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలని సీఐ టి.నరసింహులు తెలిపారు. బుధవారం పులివెందుల – కడప బైపాస్, ఎన్టీఆర్ సర్కిల్‌లో తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్ లేని వారికి జరిమానాలు విధించారు. అనంతరం సీఐ టి.నరసింహులు మాట్లాడుతూ వాహనదారులు ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలని అన్నారు. వాహనాల రికార్డులు తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, మైనర్ లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమన్నారు. అలాగే సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమన్నారు. వీటి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇంటి నుంచి బయటకు వచ్చే సందర్భాల్లో వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించి, వాహన పత్రాలు, తమ లైసెన్స్ కలిగి ఉండాలని వాహనదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## కేసీ పుల్లయ్య ఆదర్శవంతుడు




**ప్రొద్దుటూరు– సూర్య వాస్తవం:** విద్యార్థులను ఆదుకోవడంలో కెసి పుల్లయ్య దాతృత్వం ఎనలేనిదని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక వైఎంఆర్ కాలనీలోని వాసవీ కాటన్ మర్చంట్స్ కళ్యాణ మండపంలో కె.సి. పుల్లయ్య 14వ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కె.సి. పుల్లయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువత కోసం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా ఉపాధి శిక్షణ ఇవ్వడం ఆనందకరమన్నారు. కె.సి. పుల్లయ్య ఆశయాలని వారు కుటుంబ సభ్యులు కొనసాగించడం అభినందనీయ మన్నారు. కాగా జీఎస్టీ కడప డివిజన్ జాయింట్ కమిషనర్ సుమతి మాట్లా డుతూ సమాజానికి తిరిగి ఇవ్వాలనే లక్ష్యంతో కె సి పుల్లయ్య సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఆర్యవైశ్య సంక్షేమ మరియు అభివృద్ధి సంస్థ ఛైర్మన్ రాకేష్ మాట్లాడుతూ తనకు జన్మనిచ్చిన పట్టణానికి సేవ చేయటానికి కె సి పుల్లయ్య ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయ మన్నారు. జడ్పీ సిఈఓ ఓబుళమ్మ మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా ఎంతోమంది విద్యార్థులకు, యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించడం అభినందనీయ మన్నారు. కె సి పుల్లయ్య ఫౌండేషన్ నిర్వాహకులు అనిల్ కుమార్ మాట్లాడుతూ కె సి పుల్లయ్య ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు దాదాపు 300 మందికి స్కాలర్షిప్ లు పంపిణీ చేశామన్నారు. ఇంతవరకు తమ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా హెల్త్, ఐటీ విభాగాలలో శిక్షణ ఇచ్చామని, ప్రస్తుతం జూట్, బ్యూటీషియన్, మగ్గం వర్క్ ద్వారా శిక్షణ ఇస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో కెసి పుల్లయ్య ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ కె. కృష్ణవేణమ్మ, నిర్వాహకులు సుశీల్ కుమార్, నవీన్ కుమార్, సిఈఓ సుధా రాణి, డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి, సాధు గోపాలకృష్ణ, జింకా సుబ్రహ్మణ్యం, మాజీ టిటిడి బోర్డు మెంబర్ మారుతీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీజ మోడల్ కంటైనర్ పాల సేకరణ కేంద్రాల ప్రారంభం



**కుప్పం– సూర్య వాస్తవం :** శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఎన్‌డిడిబి, ఎన్‌డిఎస్, జైకాల సహకారంతో శ్రీజ మహిళా యజమానుల కోసం నూతన మోడల్ కంటైనర్ పాల సేకరణ కేంద్రాలను బుధవారం ఘనంగా ప్రారంభించారు. కుప్పం మండలంలోని కొత్తఇండ్లు, చందం, గుండ్లపల్లి గ్రామాలలో, శాంతిపురం మండలంలోని అబకల దొడ్డి,వెంకటేపల్లి గ్రామాలలో ఘనంగా ప్రారంభించడం జరిగిందని తెలిపారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీజ సీఈవో తిమ్మప్పసూరా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో శ్రీజ మహిళా పాల ఉత్పత్తిదారుల మహిళల కోసం అత్యాధునికమైన పాల కేంద్రాలను మొట్ట మొదటిసారి ఆంధ్రప్రదేశ్లో అందునా ముఖ్యమంత్రి నియోజకవర్గమైన కుప్పంలో ప్రారంభించినందుకు సంతోషిస్తున్నామన్నారు. దీని ద్వారా శ్రీజ పాల ఉత్పత్తిదారుల మహిళా యజమానులు ఆర్థికంగా పురోభివృద్ధి సాధించవచ్చని తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో అత్యాధునికమైన పాల కేంద్రాలను ప్రారంభించినందుకు శ్రీజ యాజమా న్యానికి మహిళా పాల ఉత్పత్తిదారుల సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నేషనల్ డైరీ డెవలప్మెంట్ బోర్డ్ జనరల్ మేనేజర్ కోదండ పాణి,శ్రీజ హెడ్ ప్రొక్యూర్ మెంట్ రాజేంద్ర బాబు,శ్రీజ హెడ్ ఎఫ్ఈఎస్ వై.కృపాకర్, శ్రీజ హెడ్ పిఐబి ఎం.నిశాంత్, ఏరియా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ పిఎస్ రెడ్డమ్మ, గిరిజ, నవీన కుమారి, శ్రీజ ఏరియా క్షేత్ర సిబ్బంది పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS
ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )